ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 7
జిల్లా వార్తలు
సోమవారం 1, జనవరి 2024



హ్యాపీ న్యూ ఇయర్

ఉత్సాహంగా నూతన సంవత్సరానికి స్వాగతం





నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుకుంటూ కేరింతలు కొడుతున్న యువతులు (ఇన్‌సెట్లో) ఒంగోలు నగరంలోని ఓ దుకాణంలో కేక్‌ల కోసం బారులు తీరిన ప్రజలు

జిల్లా అంతటా మిన్నంటిన సంబరాలు

విద్యుత్ దీపాలంకరణలో ఆలయాలు, చర్చిలు

ప్రత్యేక పూజలు, ప్రార్థనలు

కిక్కిరిసిన బేకరీలు, స్వీట్లకు డిమాండ్

ఒంగోలు (కల్చరల్), డిసెంబరు 31 : జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి ప్రజలు ఆనందోత్సాహాలతో స్వాగతం పలికారు. 2024 ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు నింపాలని, కొత్త మార్పులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత కేక్‌లు కట్ చేయడంతో పాటు, పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. యువత మరింత జోష్‌తో కేరింతలు కొట్టింది. జిల్లాలోని దేవాలయాలు, చర్చిలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. పూజలు, ప్రార్థనలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు సైతం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రీటింగ్ కార్డులు, పండ్లు, పూలదండలు, బొకేలు, నూతన వస్త్రాలు కొనుగోలు చేసే వారితో ఆదివారం ఉదయం నుంచే నగరంలోని ఆయా దుకాణాలు కళకళలాడాయి. అయితే నూతన సంవత్సరం డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు పలు రకాల వస్తువుల ధరలను భారీగా పెంచేశారు. మరోవైపు బేకరీలు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పోలీసుల ముందస్తు హెచ్చరికలు, ప్రధాన కూడళ్లలో బందోబస్తు నిర్వహించడంతో ప్రజలు బహిరంగ వేడుకలకు కొంత దూరంగా ఉన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఫోన్లలో మెసేజీలు, సోషల్ మీడియాలో పోస్టులతో యువత బిజీగా గడిపింది.



జగన్నాటకం

వైసీపీ అభ్యర్థుల ఎంపికపై తుది దశలో పడిన పీటముడి సరికొత్త పంథాలోకి మారే అవకాశం కనిపిస్తోంది. ఎంపీ మాగుంటకు కొత్త షరతులు విధించి దూరంగా పెట్టిన సీఎం జగన్.. తన బాబాయి అయిన మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని రంగంలోకి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఆ వ్యూహంతోనే మాగుంట, బాలినేని మైత్రిని దెబ్బకొట్టేందుకు సరికొత్త వ్యూహానికి తెరతీశారు. బాలినేనికి అవసరమైతే గిద్దలూరు స్థానాన్ని కేటాయిస్తామని, రెండుస్థానాల్లో మీరు సూచించిన అభ్యర్థులకు అవకాశం ఇస్తామని ఆశ పెట్టినట్లు కూడా తెలుస్తోంది. తాజాగా మార్కాపురం నుంచి ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేరు తెరపైకి రావడం అందుకు ఉదాహరణగా చెబుతున్నారు. అదేసమయంలో ఉమ్మడి జిల్లాలోని ఓ సీనియర్ ఎమ్మెల్యేతో శనివారం ఐప్యాక్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఎన్నికలకు అవసరమైన ఆర్థిక సహకారం ఇస్తామని తనకు పార్టీలోని కొందరు పెద్దలు చెప్పారని, ముందు ఆ విషయంలో వారి వైఖరేమిటో తెలుసుకుని రావాలని ఆయన సూటిగా చెప్పినట్లు తెలిసింది. అదేసమయంలో పలువురు వైసీపీ నాయకుల అడుగులపై ఐప్యాక్ ప్రతినిధులు నిఘాపెట్టారు.

- తెరపైకి వైవీ, జంకె పేర్లు
- గిద్దలూరు, ఒంగోలును పక్కనబెట్టి మార్కాపురంపై సీఎం దృష్టి
- మాగుంట విషయంలో ఇరకాటంలో బాలినేని
- ఇచ్చిన హామీ గురించి తేల్చాలని ఓ ఎమ్మెల్యే అధిష్ఠానానికి సమాచారం
- ఆయనతో ఐప్యాక్ ప్రతినిధుల సుదీర్ఘ భేటీ


బాలినేని శ్రీనివాసరెడ్డి


మాగుంట శ్రీనివాసులరెడ్డి



వైవీ సుబ్బారెడ్డి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసీపీ అభ్యర్థుల జాబితా ఖరారు సోమ, మంగళవారాలకు వాయిదా పడింది. సీఎం జగన్ వ్యూహాత్మకంగానే ఈ ప్రక్రియను వాయిదా వేసినట్లు భావిస్తున్నారు. తద్వారా లోక్‌సభ అభ్యర్థి విషయంలో తన ఆలోచనను తెరపైకి తేవడంతోపాటు మాగుంట, బాలినేనిల మధ్య సఖ్యతను దెబ్బ తీయాలని కూడా యోచిస్తున్నట్లు భావిస్తున్నారు. గత కొద్దినెలలుగా ఒంగోలు ఎమ్మెల్యే అయిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి.. ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు అసెంబ్లీకి తాను పోటీచేస్తున్నట్లు ప్రకటిస్తున్న విషయం విదితమే. ఒంగోలుతోపాటు జిల్లాలోని ఆయాప్రాంతాల్లో జరిగిన సభల్లో కూడా ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అయితే రెండురోజుల క్రితం ఆయన విజయసాయితో పాటు వెళ్లి సీఎంను కలిసినప్పుడు మాగుంట విషయాన్ని పక్కనపెట్టాలని జగన్ సూటిగా చెప్పారు. తాను విధించిన షరతులకు మాగుంట నుంచి సానుకూల స్పందన రాలేదన్న విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించి ఆయన విషయాన్ని వదిలేయాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆ మరుదినమే విజయసాయిరెడ్డితో జగన్ సరికొత్త ప్రతిపాదనను తెలిపారు. గత ఎన్నికల్లో వైసీపీకి భారీ ఆధిక్యం వచ్చిన గిద్దలూరు నుంచి బాలినేని పోటీచేసినా తనకు అభ్యంతరం లేదని, అయితే ఒంగోలులో దీటైన అభ్యర్థిని బరిలో నిలిపి గెలిపించాల్సిన బాధ్యత ఆయనదేనని కూడా చెప్పారు. అలాగే పశ్చిమ ప్రాంతంలో ఒకట్రెండు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల విషయంలో బాలినేని ప్రతిపాదనకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించినట్లు తెలిసింది. తదనుగుణంగానే జిల్లాలో అభ్యర్థుల ఎంపికను పూర్తిచేయకుండా వాయిదా వేశారు.

ఇరకాటంలో బాలినేని

జగన్ ప్రతిపాదన సహజంగానే బాలినేనికి ఇబ్బందికరంగా మారింది. 'గతంలో జగన్‌పై ఉన్న నమ్మకంతోనే నేను మాగుంట విషయాన్ని బహిరంగంగా ప్రకటించాను. ఇప్పుడు ఆయన్ను ఒంటరిగా వదిలేయడం మంచిదికాదు. ఆయనకు మద్దతుగా నిలవక తప్పదు' అని బాలినేని తన అనుచరులతో అన్నట్లు తెలిసింది. తనకు ఒకట్రెండు నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యం ఇచ్చినా మాగుంట విషయంలో వెనక్కు తగ్గడం తగదన్న భావనతో ఆయన ఉన్నారు. దీంతో మాగుంటకు అవకాశం ఇవ్వాల్సిందేనని విజయసాయి ద్వారా సమాచారం పంపారు. తాడేపల్లి వెళ్లి విజయసాయిని కలిసి సీఎం జగన్‌ను కలవకుండా వెనక్కు వెళ్లిన మాగుంట ప్రస్తుతం బాలినేనితో టచ్‌లోనే ఉన్నట్లు తెలిసింది. మాగుంటను పక్కనపెట్టి తిరిగి ఒంగోలు లోక్‌సభకు వైవీ అభ్యర్థిత్వాన్ని తెరపైకి తెస్తే సహజంగానే బాలినేని దానిని జీర్ణించుకోలేరు. దీంతో అధిష్ఠానంయొక్క వ్యూహాన్ని ఎలా ఎదుర్కోవాలన్న విషయమై అనుచరులతో బాలినేని మంతనాలు జరుపుతున్నారు. తదనుగుణంగానే ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి మాగుంటకు, అసెంబ్లీకి తనకు అవకాశం ఇవ్వాలన్న సమాచారం పంపినట్లు తెలుస్తోంది. పైగా బాలినేని గిద్దలూరు వెళ్లినా ఒంగోలు అభ్యర్థి ఎంపిక విషయంలో సమస్యలున్నట్లు తెలిసింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దర్శి మినహా ఇతర ప్రాంతాల్లో పోటీచేయనని ఇప్పటికే తేల్చి చెప్పారు. అయితే గత ఎన్నికల్లో సిటింగ్ ఎంపీగా ఉన్న వైవీని తప్పించిన జగన్ అప్పుడిచ్చిన హామీ మేరకు వైవీని ఇప్పుడు మళ్లీ రంగంలోకి తెస్తారా? బాలినేని అందుకు సహకరిస్తారా? బాలినేని, మాగుంట బంధం తెగుతుందా లేక సరికొత్త పంథాలో కలిసి అడుగేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.



మార్కాపురానికి పరిశీలనలో జంకె పేరు



మార్కాపురం నియోజకవర్గం నుంచి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేరును ఆపార్టీ అధిష్ఠానం సీరియస్‌గానే పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆర్థికంగా ఇబ్బందులున్న అంశాన్ని పక్కనపెడితే మిగిలిన విషయాల్లో ఆయన్ను తీసిపారేయలేమని ఐప్యాక్ ప్రతినిధులు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. పైపెచ్చు తనను పూర్తిగా పక్కనపెడితే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీచేయాలన్న ఆలోచన జంకె చేస్తున్నట్లు తెలిసింది. 1994లో అలా టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన జంకె.. కుదిరితే అప్పట్లా అవకాశం వస్తుంది, కాకపోయినా తనకు పోయేదేముంది అన్న భావనతో ఉన్నట్లు ఆయన అనుచరులు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జంకె పేరును అధిష్ఠానం తిరిగి పరిశీలిస్తుండటం చర్చనీయాంశమైంది.

సీనియర్ ఎమ్మెల్యేతో ఐప్యాక్ ప్రతినిధుల భేటీ

ఉమ్మడి జిల్లాలోని దక్షిణ ప్రాంతానికి చెందిన ఒక సీనియర్ ఎమ్మెల్యేతో ఐప్యాక్ ప్రతినిధులు శనివారం భేటీ అయినట్లు తెలిసింది. వారు కొన్ని అంశాలపై ఎమ్మెల్యేను సూటిగా ప్రశ్నించగా ఆయన నిర్మొహమాటంగా పలు విషయాలను వారి దృష్టికి తెచ్చినట్లు తెలుస్తోంది. శనివారం సాయంత్రం ఆయన అనుచరులే ఐప్యాక్ ప్రతినిధులు భేటీ అయినట్లు సదరు ఎమ్మెల్యే చెప్పిన అంశాలను బహిరంగంగా ప్రస్తావిస్తున్నారు. 'నాకు పార్టీ మారే ఉద్దేశం లేదు. అవసరమూ లేదు. నాకు వారసులు లేరు. ఆపై ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆశ కూడా లేదు. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ విషయాన్ని ముఖ్య నాయకులు ప్రస్తావించినప్పుడు ఆర్థిక సహకారం అవసరమని చెప్పా. డబ్బు రాజకీయాలు వచ్చినందున ప్రత్యర్థుల కన్నా మనం ఎక్కువ ఖర్చు చేయకపోతే ఉపయోగం లేదు. నా దగ్గర డబ్బులు లేవన్న విషయాన్ని అధిష్ఠానంలోని ముఖ్య నాయకులకు ఇప్పటికే చెప్పా' అని ఐప్యాక్ ప్రతినిధులకు గుర్తుచేసినట్లు తెలిసింది. అప్పుడు హామీ ఇచ్చిన ఇద్దరు నాయకులు దాని అమలు దిశగా అడుగులు వేయలేదని, ముందు ఆ విషయాన్ని తేల్చుకుని రావాలని ఐప్యాక్ ప్రతినిధులకు ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇంకోవైపు శనివారం జిల్లా మొత్తంగా ఐప్యాక్ ప్రతినిధులు వైసీపీ ఇన్‌చార్జిలు, ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్య నాయకులపై నిఘా పెట్టారు. ఇతర పార్టీలకు టచ్‌లో ఉన్నారా? లేక వెన్నుపోటు వ్యవహారాలకు సిద్ధమవుతున్నారా? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఒక నాయకుడైతే మీరు చేసింది చాలు, నిఘాలు పెట్టి మమ్మల్ని ఏమి చేయగలరంటూ తన ఇంటివద్దకు వచ్చిన ఐప్యాక్ ప్రతినిధులను కసురుకుని పంపినట్లు సమాచారం.



సభాస్థలి ఏర్పాటుకు డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో కొలతలు వేస్తున్న ప్రత్యేక సిబ్బంది

శంఖారావం సభకు ముమ్మర ఏర్పాట్లు

- పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, డిసెంబరు 31 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 5న చేపట్టనున్న శంఖారావం సభకు కనిగిరిలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణ సమీపంలోని చాకిరాల సమీపంలోని సభాస్థలం వద్ద ఏర్పాట్లలో భాగంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కొలతలు వేశారు. దాదాపు 2లక్షల మంది సభకు హాజరవుతారని అంచనా వేసి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అక్కడకు సమీపంలోనే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అదే ప్రాంతంలో భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఉగ్ర వెంట పార్టీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), సిద్ధాటపు వెంకటరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, అబ్దుల్లా, జంషీర్, గండికోట రమేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట కబడ్డీ ఆడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆట.. ఆందోళన

- వినూత్న రీతిలో అంగన్‌వాడీల నిరసన

ఒంగోలు నగరం, డిసెంబరు 31 : సమస్యల పరిష్కారం కోరుతూ 20 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ఆదివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రోడ్డుపైనే ఆటాపాటా నిర్వహించారు. ఉద్యమంపై ప్రత్యేకంగా రూపొందించిన పాటలకు నృత్యాలు చేస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట కార్యకర్తలు, ఆయాలు కబడ్డీ ఆడారు. వేతనాలు పెంచకపోతే రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వంతో ఇదేవిధంగా కబడ్డీ ఆడేస్తామంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. గిద్దలూరులో తెల్లటోపీలు పెట్టుకుని మా నెత్తిన ప్రభుత్వం టోపీ పెట్టిందంటూ నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రాల్లో కబడ్డీ, సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. 'మీరిచ్చిన హామీనే మరిచిపోయారా జగన్..' అంటూ పాటలు పాడి.. ఆటలు ఆడి నిరసన గళాన్ని వినిపించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.వి.సుబ్బమ్మ, అన్నపూర్ణ, ప్రశాంతి, కల్పన, రాజేశ్వరి, జ్యోతి, సంధ్యారాణి పాల్గొన్నారు.

అడ్డగింతలు..అరెస్టులు..!

- మునిసిపల్ కార్మికుల సమ్మె ఉధృతం
- నీరుగార్చేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నం
- ఒంగోలులో పోలీసులతో వాగ్వాదం.. తోపులాట
- సొమ్మసిల్లి పడిపోయిన కార్మికురాలు





ఆందోళన చేస్తున్న కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు (ఇన్‌సెట్లో)తోపులాటలో సొమ్మసిల్లిన కార్మికురాలు

ఒంగోలు (కార్పొరేషన్), డిసెంబరు 31 : మునిసిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వం ఒకవైపు పోలీసుల ద్వారా బలప్రయోగం, అరెస్టులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ కార్మికులు ఏమాత్రం వెరవకపోగా మరింత ఉధృతం చేశారు. ఆదివారం ఒంగోలులో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తుండగా అడ్డుకున్నారు. దీంతోపాటు రోడ్లపైనే చెత్త సేకరణ వాహనాల ముందు చలిమంటలు వేసి నిరసన తెలిపారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా వారికి, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. పారిశుధ్య కార్మికురాలు ఉమ సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకొంది. పలువురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. మార్కాపురం, గిద్దలూరులో అర్ధనగ్న ప్రదర్శనలు చేశారు. కనిగిరిలో విధుల్లోకి వెళ్లిన ఔట్ సోర్సింగ్ కార్మికులను అడ్డుకున్నారు. పొదిలిలో నిరసన కొనసాగించారు. మరోవైపు ప్రభుత్వం సమ్మెను నీరుగార్చే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. సర్కారు ఆదేశాలతో అధికారులు ప్రైవేటు వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. వారు పగలు, రాత్రి వేళల్లో పనులు చేస్తున్నప్పటికీ వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది.

ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద హైడ్రామా

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సర్కారు వైన్స్ సూపర్ వైజర్ తండ్రి

పట్టుకున్న ఎస్ఈబీ పోలీసులు

తానే బాధ్యత వహిస్తానని లొంగిపోయిన కుమారుడు

విచారణలో సీఐ కొట్టారని పరుగు

ఆందోళనకు దిగిన ఆయన బంధువులు

ఎమ్మెల్యే బుర్రా రాక.. డబుల్ యాక్షన్

కనిగిరిలో ఘటన

కనిగిరి, డిసెంబరు 31 : కనిగిరి ఎస్ఈబీ పోలీసు స్టేషన్ వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. మద్యం అక్రమంగా విక్రయించిన ఓ వ్యక్తి పట్ల సీఐ దురుసుగా ప్రవర్తించారంటూ ఆయన బంధువులు ఆందోళనకు దిగారు. అనంతరం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ రంగప్రవేశం చేసి డబుల్ యాక్షన్ చేశారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన పామూరు పట్టణంలో ఇరువూరు సెంటర్ వద్ద జాజుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కూల్‌డ్రింక్ షాప్ నిర్వహిస్తున్నారు. ఆయన మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఎస్ఈబీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతని కూల్‌డ్రింక్ షాపుపై ఆదివారం ఆకస్మికంగా దాడి చేశారు. అక్కడ నాలుగు క్వార్టర్ బాటిళ్లు దొరికాయి. దీంతో కూల్‌డ్రింక్ షాపు నిర్వాహకుడు వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆయన కుమారుడు శ్రీకాంత్ తన తండ్రికి ఆరోగ్యం బాగాలేదని, తాను పూర్తి బాధ్యత వహిస్తానంటూ పోలీసుల వద్ద లొంగిపోయాడు. అతనిని విచారణ పేరుతో పోలీసులు కనిగిరి ఎస్ఈబీ కార్యాలయానికి తీసుకువచ్చారు.

విచారణ చేస్తుండగా పరుగు తీసిన యువకుడు

పామూరులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో జాజుల శ్రీకాంత్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అసలు సూత్రధారి ఆయనే అని గుర్తించిన ఎస్ఈబీ పోలీసులు అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్‌కు ఉన్న లాక్ ఓపెన్ చేయాల్సిందిగా శ్రీకాంత్‌కు సీఐ జలీల్‌ఖాన్ సూచించగా తన ఫోన్ కాదంటూ దాటవేశాడు. ఈ క్రమంలో సీఐ తన సిబ్బందితో కలసి బలవంతంగా శ్రీకాంత్‌ను సెల్‌ఫోన్‌పై వేలిముద్ర వేయించబోగా వారిని నెట్టేసి బయటకు పరుగులు తీసి తనను కొట్టారని పెద్దగా కేకలు వేశాడు. తన తలపై గాయం అయ్యిందని చూపించాడు. దీంతో అప్పటికే పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న శ్రీకాంత్ స్నేహితులు, బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులకు ఎస్ఈబీ సీఐ సమాచారం ఇవ్వడంతో శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే శ్రీకాంత్ స్టేషన్ నుంచి బయటకు పరుగు తీసే సమయంలో గోడను బలంగా ఢీకొట్టడంతో గాయమైందని ఎస్ఈబీ అధికారులు చెప్తున్నారు.



బయట ఇలా.. లోపల అలా..

శ్రీకాంత్‌కు మద్దతుగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. మద్యం అక్రమంగా విక్రయించే వ్యక్తులకు మద్దతుగా ఎమ్మెల్యే రావడం పోలీసులు, ప్రజలను విస్మయానికి గురిచేసింది. ఆ సమయంలో అక్కడే ఉన్న సీఐ జలీల్‌ఖాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఎస్ఐ మాధవరావు గదిలోకి ఎమ్మెల్యే, ఎస్ఈబీ సీఐ జలీల్‌ఖాన్‌లు వెళ్లి తలుపు వేసి కొంతసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారు. ఇక్కడ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. మరోపక్క బయటికి వచ్చి సీఐ జలీల్‌ఖాన్‌పై ఫిర్యాదు చేయాలని బాధితుడు శ్రీకాంత్‌కు చెప్పడంతో ఎమ్మెల్యే డబుల్ యాక్షన్‌లో రక్తికట్టించినట్లు పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. ఆ ఫిర్యాదు కూడా వైసీపీ నాయకుడు రంగనాయకులరెడ్డి చేత రాయించడం మరో విశేషం. దీంతో అటు శ్రీకాంత్ కుటుంబసభ్యులు, ఇటు పోలీసులు కూడా అయోమయంలో పడ్డారు.

6నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన

దర్శి, డిసెంబరు 31 : సంక్రాంతి పండుగ సందర్భంగా జనసేన పార్టీ, గరికపాటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఈనెల 6వ తేదీ నుంచి దర్శిలో నిర్వహిస్తున్నట్లు దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ తెలిపారు. జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు నాలుగు రోజులు నాలుగు కేటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. 6న నాలుగు పళ్ల విభాగం ఎడ్లు, 7వ తేదీన ఆరు పళ్ల విభాగం ఎడ్లు, 8వ తేదీ న్యూ క్యాటగిరీ ఎడ్లు, 9వ తేదీన సీనియర్ క్యాటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన సీనియర్ కేటగిరీ ఎడ్ల విజేతలకు ప్రథమ బహుమతిగా ట్రాక్టర్, రెండవ రూ.1.50 లక్షలు, మూడవ బహుమతి గా రూ.1.20 లక్షలు, నాల్గవ బహుమతిగా రూ.లక్ష, ఐదవ బహుమతిగా రూ.20 వేలు, ఆరవ బహుమతిగా రూ.70 వేలు, ఏడవ బహుమతి రూ.60 వేలు, 8వ బహుమతిగా రూ. 50వేలు, తొమ్మిదవ బహుమతి రూ.40 వేలు అందించటం జరుగుతుందన్నారు.





వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే స్వామి ధ్వజం


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, డిసెంబరు 31 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని, మౌలిక వసతులు కల్పించడంలో ఆపార్టీ నేతలు పూర్తిగా విఫలం చెందారని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. ఆదివారం పంచాయతీ పరిధిలోని బాలయోగినగర్‌లో నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత టీడీపీ హయాంలో పంచాయతీలోని ప్రజల తాగునీటి అవసరార్థం రామతీర్థం నీటిని అందించామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆనీటిని కూడా సక్రమంగా ఇవ్వలేక అపసోపాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని మండిపడ్డారు. మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి దీపాలు కూడా వేయలేని దౌర్భాగ్య స్థితిలో వైసీపీ నేతలు ఉండటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. బాలయోగినగర్ శివారు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వేసిన సీసీరోడ్లను నీటి కొళాయిల పేరుతో ధ్వంసం చేసి కనీసం మరమ్మతులు చేయకుండా వదలివేశారని స్వామి మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వంలో స్థానికంగా ఉన్న అన్ని గ్రావెల్‌రోడ్లను సీసీ రోడ్లగా మార్చమన్నారు. వైసీపీ 57 నెలల పాలనలో ఒక్క సైడుకాలువనైనా నిర్మించడానికి అధికారపార్టీ నేతలకు చేతులు రాలేదా.. అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులకు అభివృద్ధి మీద ఏమాత్రం యావలేదని, అవినీతి దందాలలో మాత్రం తమ నాయకుడితో పోటీపడుతూ ఉన్నారని దుయ్యబట్టారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాల గురించి క్షుణ్ణంగా వివరించి, వాటి వలన చేకూరే లబ్ధిని ప్రజలకు తెలికజేశారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, టీడీపీ నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, పులి ప్రసాద్, మందలపు గాంధీచౌదరి, ఇమ్మిడిశెట్టి రామారావు, చిగురుపాటి గిరి, గుదే వెంకటేశ్వర్లు, మించల బ్రహ్మయ్య, బ్రహ్మేశ్వరరావు, కళ్లగుంట నరసింహ, పసుపులేటి శేషారావు, సన్నెబోయిన మాలకొండయ్య, యస్థాని, అబ్దుల్ సుభాన్, సనావుల్లా, శీలం చంటి, రవిశంకర్‌రెడ్డి, దక్షిణం శ్రీను, మోటుపల్లి వెంకటేశ్వర్లు, వల్లెపు రవి, జుమ్ము శంకర్, తుమ్మా కోటేశ్వరరావు పాల్గొన్నారు.





టీడీపీ తీర్థం పుచ్చుకున్న 40 కుటుంబాలు


టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీలో చేరిక

సింగరాయకొండ, డిసెంబరు 31 : సింగరాయకొండ పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో టీడీపీ చేరారు. దాదాపు 35 కుటుంబాల వారిని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో స్థానిక మాజీ సర్పంచ్ డాక్టర్ కుంభా నాగమణి భర్త ఉప్పిరెట్ల రవీంద్ర, చుండూరు సుబ్బారావు, పాలకిట్టి సుబ్బారావు, అన్నం ధనుంజయతో పలువురు ఉన్నారు.

అలాగే బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం సందర్భంగా బాలయోగినగర్‌కు చెందిన గట్టు నరసింహ వీరితో పాటు ఐదు కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే స్వామి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులకు ఎలప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.







ఆట, పాటలతో అంగన్‌వాడీల నిరసన


కబడ్డీ ఆడుతున్న అంగన్‌వాడీలు

కొండపి, డిసెంబరు 31: తమ సమస్యలు పరిష్కరించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆదివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. 20వ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా కొండపిలోని మండల కార్యాలయాల ప్రాంగణంలో కుర్చీలాట, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల యూనియన్ నాయకులు మస్తానమ్మ, కాశీరత్నం, కిరణ్మయి, మాంచాలమ్మ, సాయిలీల, అరుణ, సుబ్బమ్మ, తులసి, ఈశ్వరమ్మ పాల్గొన్నాయి.

టంగుటూరులో కబడ్డీ ఆడి నిరసన

టంగుటూరు : టంగుటూరులో అంగన్‌వాడీలు కబడ్డీ, లెమన్‌స్పూన్ ఆడి నిరసన తెలిపారు. టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల అంగనవాడీలంతా టంగుటూరులోని కార్యాలయానికి చేరుకొని కబడ్డీ ఆడారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వీ మోజెస్, జమ్ములపాలెం అంగనవాడీ కార్యకర్త జ్యోతి రెఫరీగా వ్యవహరించారు. కబాడీ ముగియగానే లెమన్ స్పూన్ ఆట కొనసాగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు బి. శేషమ్మ, పి క్రాంతి, సుభాషిణి, ప్రసన్న కె. హేమలత, కుమరునిస్సా, విజయ, నిర్మల, సునీత, లక్ష్మి పాల్గొన్నారు.







మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

టంగుటూరు, డిసెంబరు 31: టంగుటూరు శివారు వెంకటాయపాలెంలో ఆదివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బోనం ప్రశాంత్ అక్రమంగా మద్యం కొనుగోలు చేసి తెచ్చి గ్రామంలో మందుబాబులకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో ఎస్సై ఖాదర్‌బాషా తన సిబ్బందితో వెంకటాయపాలెం చేరుకొని మద్యం విక్రయిస్తున్న ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి 20 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రశాంత్‌ను అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.









జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధుల

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), డిసెంబరు 31 : ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సుఖసంతోషాలతో అందరూ జీవనం సాగించాలని ఆకాంక్షించారు. అలాగే ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాదిలో అందరి కలలు సాకారం కావాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దామచర్ల శుభాకాంక్షలు

ఒంగోలు(కార్పొరేషన్): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ జిల్లా ప్రజలకు, పార్టీ శ్రేణులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2024 సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు నింపాలని, ఆయురారోగ్యాలతో గడపుతూ, మరెన్నో విజయాలతో ఆనందంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

మద్దిపాడు, డిసెంబరు 31: నూతన సంవత్సర వేడుకల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించేది లేదని, గుంపులుగా ఏర్పడి అల్లర్లకు పాల్పడిప చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు భద్రత కల్పించాలి

- జేఏసీ నాయకుల డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), డిసెంబరు 31: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. గత 12 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఆయా సమస్యలను పట్టించుకో కుండా ఉద్యోగుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నాలు చేయడం దారుణంగా ఉందన్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ (జేఏసీ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షకు సీఐటీయూ కార్యదర్శి శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్ర నేత పోతులూరయ్య, సుబ్బారెడ్డిలు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ, వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పది లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు గ్రాడ్యుటీ కల్పించాలన్నారు. ఉద్యోగులకు సామాజిక భద్రత పథకాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, పదవీ విరమణ వయస్సును పెంచాలని వారు కోరారు. సీఆర్ఎంటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, మండల లెవల్ అకౌంటెంట్స్, మెసెంజర్స్, ఆర్ట్, పీఈటీ, సైట్ ఇంజనీర్స్, కేజీబీవీ స్కూల్ టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీ పోస్టులను భర్తీ చేసి పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. మహేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, కళ్యాణి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు, డిసెంబరు 31: జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.సరళమ్మ పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడు పీ హెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆమె ప్రారంభిచారు. ఈ సందర్భంగా సరళమ్మ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తుం దని చెప్పారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ మూర్తి మాట్లాడుతూ పేదప్రజలకు మెరుగైన వైద్యం అందజేస్తుందని చెప్పారు. డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సురక్ష క్యాంపుల్లో అన్ని రకాల వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనందమోహన్, బాలకోటయ్య, శ్రీనివాసరావు, పద్మావతి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

• జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్‌పర్సన్ వెంకాయమ్మ

సంతనూతలపాడు, డిసెంబరు 31: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. పేర్నమిట్ట జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 42వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాలురు, బాలికల షూటింగ్ బాల్‌పోటీలను చైర్‌పర్సన్ వెంకాయమ్మ ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలను మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డి.రమణమ్మ, కార్పొరేటర్ ఎస్.మస్తానమ్మ, మండల వైసీపీ కన్వీనర్ డి.చెంచిరెడ్డి, ఎస్.క్రిష్ణ, కె.నారాయణరావు, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

లారీ యజమానుల వితరణ



సరుకులను అందిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

చీమకుర్తి, డిసెంబరు 31 : చీమకుర్తి పట్టణంలోని ఎస్‌కేఆర్ బధిరులు దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు మండల లారీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు తమ చేయూతనిందించారు. .విద్యార్థుల భోజనం కోసం సరిపడా సరకులను ఆదివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు అందజేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎస్‌ఐ రామిరెడ్డి, డాక్టర్ జవహర్, చలువాది బదరినారాయణ, మేదరమెట్ల శ్రీనివాసరావు, జాస్తి రామారావు, గోగినేని వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి, లగడపాటి శ్రీనివాసరావు, సూరంపల్లి హనుమంతరావు, బుల్లబ్బాయి, ప్రసాదరెడ్డిలు అసోసియేషన్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగం రమణారెడ్డి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం



నిరసన ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

చీమకుర్తి, డిసెంబరు 31 : తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె రోజురోజుకు ఉధృతమవుతుంది. ఆదివారం కార్మికుల సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. కార్మికులు చీమకుర్తి మున్సిపల్ కార్యాలయ ముట్టడి, పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అధికారులు చెత్త సేకరణకు చేపడుతున్న చర్యలను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రాత్రి, పగలు కాపాలా కాస్తున్నారు. రోడ్లపైనే నిద్రిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కార్మికసంఘ నాయకలు ఇట్టా నాగయ్య, కోటేశ్వరరావు, పద్మ తదితరులు కోరారు.

బెల్లం ఊట ధ్వంసం



బట్టీని ధ్వంసం చేస్తున్న అధికారులు

పెద్దదోర్నాల, డిసెంబరు 31: మండలంలోని పెద్ద మంతనాల, పనుకుమడుగు, తిమ్మాపురం గ్రామాలలో పోలీసు, సెబ్ అధికారులు ఆదివారం విస్తృత దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేసి అందుకు వినియోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1900 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు.

గిద్దలూరు టౌన్ : మండలంలోని ఓబులాపురం తాండా సమీప అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లంఊటను, బట్టీని ఎస్ఈబీ అధికారులు ధ్వంసం చేశారు.

అత్యాచారం కేసులో యువకుడి అరెస్టు

మార్కాపురం రూరల్, డిసెంబరు 31: మండలంలోని రాయవరం గ్రామంలో ఈ నెల 28న ఓ వృద్ధురాలపై అత్యాచారానికి పాల్పడిన దేవండ్ల కమల్నాథ్ అనే యువకుడిని మార్కాపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. దేవండ్ల కమల్నాథ్ అనే యువకుడు వృద్ధురాలపై అత్యాచారం చేసి పరారీలో ఉన్నాడు. మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి గాలిచారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో నిందితుడిని రాయవరం గ్రామంలో అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ వెల్లడించారు. అనంతరం నిందుతుడిని న్యాయాధికారి ముందు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ మద్యం సీసాల పట్టివేత

పొదిలి, డిసెంబరు 31 : తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ వెంకటసైదులు సిబ్బంది తో దర్శి పొదిలి ప్రధాన రహదారి వెంబడి హైదరాబాద్ నుండి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌ను బస్సులను తనిఖీ చేశారు. అందులో అక్రమంగా తరలిస్తున్న అక్రమ మద్యం 16 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసు కున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన విద్యుత్ సిబ్బంది

అద్దంకి, డిసెంబరు 31: అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలోని ఏఈ కార్యాలయంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి నలుగురు సిబ్బంది పట్టుబడ్డారు. విద్యుత్ సిబ్బంది పేకాట ఆడుతుండగా ఆదివారం సాయంత్రం పోలీసులు నలుగురు విద్యుత్ సిబ్బందిని అదుపులోకి తీసుకొని రూ.14,350 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. కాగా ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు ఈఈ మస్తానరావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అద్దంకి, డిసెంబరు 31: భార్య కాపురానికి రాలేదని యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అద్దంకి పట్టణం ఎన్టీఆర్ నగర్‌కు చెందిన తన్నీరు ఆంజనేయులు(33)కు ముండ్లమూరు మండలం పోలవరంనకు చెందిన యువతితో వివాహమైంది. మనస్పర్థలతో ఐదేళ్లుగా భార్య కాపురానికి రాకపోవడంతో ఆంజనేయులు శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుమందు తాగాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టిడ్కో, ఇళ్ల స్థలాల్లో రూ.35 వేల కోట్ల అవినీతి

ప్రధానికి పవన్ లేఖ రాస్తేనే వైసీపీ నేతల్లో వణుకు • జగన్‌కు శాశ్వతంగా రాజమండ్రి జైలే.. • జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్



సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్

ఒంగోలు(కలెక్టరేట్), డిసెంబరు 31: రాష్ట్రంలోని టిడ్కో ఇళ్ళు నివేశన స్థలాల్లో జరిగిన రూ.35 వేల కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై విచారణ చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ లేఖ రాస్తే వైసీపీ నాయకుల్లో భయం మొదలైందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆరోపించారు. ఒంగోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళు, స్థలాల్లో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మంత్రి జోగి రమేష్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. విచారణ జరిగితే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవినీతి బండారం బయటకు వస్తుందని చెప్పారు. ఈడీ విచారణ అంటేనే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి వైసీపీకి శాశ్వత అధ్యక్షుడిగా ఉన్నారని, 2024 సంవత్సరంలో ఆయన శాశ్వతంగా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండే విధంగా బాధ్యతలను తమ అధినేత పవన్ కళ్యాణ్ తీసుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని మంత్రి రమేష్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్రంలో ఓటు హక్కులేదని జోగి రమేష్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పవన్‌కు ఓటు లేకపోతే రాష్ట్రంలో ఏవిధంగా పోటీ చేస్తారనే జ్ఞానం లేదా అని మంత్రిపై మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు తప్ప ఎక్కడ అభివృద్ధి ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదనే విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని తెలిపారు. పవన్‌కళ్యాణ్‌కు మూడు పెళ్ళిళ్ళు జరిగాయని దేశమంతా తెలుసునని, ఈ విషయం జగన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. మీకూ కుటుంబం ఉందనే విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ పొత్తు కుదిరిన తర్వాత ఎక్కడ అధికారం పోతుందనే భయంతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. గతంలో తెలంగాణలో జగన్‌ను ఏవిధంగా తరుముకున్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని తెలిపారు. ఇటీవల పులివెందులలో ఒక వృద్ధుడు జగన్ కారుపై రాయి దాడి చేసిన విషయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. 2024 ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల్లో నొక్కే బటన్‌తోనే జగన్‌ను ఇంటికి పంపుతారని తెలిపారు. పవన్‌కళ్యాణ్ పై అవాకులు, చవాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమని రియాజ్ హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చిట్టెం ప్రసాద్, రాయని రమేష్, చనపతి రాంబాబు, ఆళ్ళ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం

• బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

ఒంగోలు(కలెక్టరేట్), డిసెంబరు 31: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పువ్వాడ దామోదర్ విమర్శించారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామని చెప్పి తరువాత సీఎం జగన్ విస్మరించారని ఆరోపించారు. ప్రతి ఏటా ఉద్యోగ నియామకాలపై నోటిఫికేషన్లు జారీ చేస్తామని నిరుద్యోగులను మోసం చేశారని చెప్పారు. లక్షల రూపాయాల ప్రజాధనాన్ని తన సొంత మనుషులకు జీతాలుగా ఇచ్చేందుకు సలహాదారులుగా నిమించుకోవడంలో ఉన్న శ్రద్ధ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే విషయంలో లేదని ఆరోపించారు రాష్ట్రంలో వేలాదిగా ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టుల భర్తీ ఊసేలేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో సగటున రోజుకు ఒక నిరుద్యోగి చొప్పున నాలుగేళ్ల కాలంలో 1345 మంది ఆత్మహత్యా చేసుకున్నారని ఇటీవల వెలుబడిన ఎన్‌సీఆర్‌బీలో గణాంకాలు చెప్తున్నాయన్నారు. జనవరి 1వతేదీన ప్రభుత్వం జాబు క్యాలెండర్ విడుదల చేయకపోతే నిరుద్యోగులతో కలిసి ఉద్యమించాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నాయక్, యువమోర్చా జిల్లా ఇన్‌చార్జి బి.అంజనేయులు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం కావాలి

• ఆర్‌వీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భాస్కరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరయ్య

ఒంగోలు(కలెక్టరేట్), డిసెంబరు 31: రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం (ఆర్‌వీఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన సదస్సుకు టంగుటూరి రాము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, రజక మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు రక్షణ చట్టాన్ని తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ళు గడుస్తున్నా సామాజిక సేవా వృత్తులుగా ఉన్న రజకులపై పెత్తందారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం దాడులు చేస్తూ అనేక ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అక్రమ కేసులను బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంలో నెఈల 29న జరిగే రాష్ట్ర సదస్సులో రజకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సాయి వికాస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె.మోహనరావు మాట్లాడుతూ రజకులందరూ ఐక్యంగా ఉండి రాజ్యాధికారంలో భాగస్వాములు అయినప్పుడు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ తోట తిరుపతిరావు మాట్లాడుతూ చేతివృత్తిదారులందరూ ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ జిల్లాలో రజకవృత్తిదారులు, కార్మికులు, ఉద్యోగులందరిని సమైక్యంగాచైతన్య పర్చడం ద్వారా భవిష్యత్‌లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను విష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సంఘం నాయకులు, రజకులు పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువకు సాగునీరు అందించాలి

• కౌలు రైతు సంఘ నాయకుల డిమాండ్



వరిపంటను పరిశీలిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), డిసెంబరు31: కొమ్మమూరు కాలువ పరిధిలోని నాగులుప్పలపాడు, చిన్నగంజాం మండలాల్లో సాగు చేసిన వరిపంటకు సాగునీరు అందించాలని కౌలు రైతు సంఘ నాయకులు టి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం కౌలురైతు సంఘనాయకులు వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నాగులుప్పలపాడు మండలం, చిన్నగంజాం మండలాల్లో కొమ్మమూరు కాలువ పరిధిలో వరిపంట 1000 ఎకరాల్లో సాగు చేశారు. కొమ్మమూరుకాలువకు సాగునీరు సక్రమంగా రాక పోవటంతో వరిపంట వెండిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈదుమూడి, మట్టిగుంట, ఉప్పుగుండూరు, పెద్దగంజాం పరిధిలో సాగునీరు లేక వరిపంట దెబ్బతినే పరిస్థితి నెలకొందని చెప్పారు. మరో రెండుతడులు నీరు ఇస్తే పంట చేతికి వస్తుందని, పొట్టదశలో ఉందని తెలిపారు. ఈనెల 20వతేదీ వరకు కొమ్మమూరుకాలుకు నీరు అందిస్తేనే పంట చేతికొస్తుందన్నారు. నీరు విడుదల చేయకపోతే పంట చేతికొచ్చే పరిస్థితి ఉండదని, అధికారులు తక్షణమే స్పందించి కొమ్మమూరు కాలువకు సాగునీరు ఇచ్చి వరిపంటను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాకాని సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ





ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షురాలు మంజుల, డైరీని విడుదల చేస్తున్న డాక్టర్ భగవాన్

ఒంగోలు(విద్య), డిసెంబరు 31: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర డైరీని, క్యాలెండర్‌ను ఆదివారం ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.మంజుల, రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాకా జనార్దన్ రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, ఐ.విజయసారథి, వి.శేషిరెడ్డి, పి.హనుమంతరావు, శేషారావు, వీవీప్రసాద్, పి.వీరరాఘవరావు, యు.సుబ్బయ్య, షేక్ బషీర్‌నీసా, జీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

-స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీకి చెందిన డైరీ, క్యాలెండర్‌ను వైస్ చాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పేర్నమిట్టలోని యూనివర్శిటీ భవనాలు, స్థలానికి అప్రోచ్‌రోడ్లు నిర్మాణం, పరిపాలన విభాగాన్ని మార్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.హరిబాబు, డీన్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

- ఏపీటీఎఫ్ టేబుల్ క్యాలెండర్‌ను రెయిన్‌బొ డెంటల్ అధినేత డాక్టర్ ఎం.భగవాన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధానకార్యదర్శి కే వీజీ.కీర్తి, బిఅశోక్‌కుమార్, ఎ.అమ్మయ్య, పీవీసుబ్బారావు, పి.అంజనేయులు, ఎస్.లక్ష్మీనారాయణ, పి.ప్రభాకరరావు, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాత రిమ్స్‌లో అగ్నిప్రమాదం



ఒంగోలు(క్రైం), డిసెంబరు31: ఒంగోలులోని రిమ్స్‌లో అగ్నిప్రమాదం జరిగి పాత వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన ఆదివారం జరిగింది. పాత రిమ్స్ ఆవరణలో ఉన్న పాటుబడిన మూడు వాహనాలు ఉన్న ప్రాంతంలో సిగిరెట్ కాల్చి పడేయడంతో ఎండుగడ్డి రాజుకుని అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని పోలీసులు బావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ పరిశీలించారు. అగ్నిమాపకదళం వారు మంటలను అదుపు చేశారు.

నేడు పోలీసు స్పందన రద్దు

ఒంగోలు (క్రైం)డిసెంబరు31: నూతన సవత్సర వేడుకల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన పోలీసు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. జిల్లా ప్రజలు గుర్తించి సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి ఎవరూ రావద్దని సూచించింది.

పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రామనాయక్

ఒంగోలు(క్రైం), డిసెంబరు31: పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రామానాయక్‌ను నియమిస్తు గుంటూరు రేంజీ ఐజీ జి.పాల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో గుంటూరు ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐగా పనిచేస్తున్న రామానాయక్‌ను పామూరు బదిలీ చేశారు.

ఫిబ్రవరి 9,10 తేదీల్లో బాలోత్సవం

ఒంగోలు(కలెక్టరేట్), డిసెంబరు 31: పిల్లల్లో సృజనాత్మకతను ప్రశ్నించే తత్వాన్ని, సమాన భావాలను పెంపొందించేందుకు ఒంగోలులో ఫిబ్రవరి 9,10 తేదీల్లో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కార్యదర్శి యూవీ.రామరాజు తెలిపారు. ఒంగోలులోని ఎన్‌జీవో భవన్‌లో ఆదివారం బాలోత్సవ నిర్వహణ కోసం ఆహ్వాన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలోని 15 ప్రాంతాల్లో బాలోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ఒంగోలులో బాలోత్సవాలను అదే స్ఫూర్తిగా నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆనందరావు, అధ్యక్షులుగా పి.ప్రకాష్‌బాబు, ప్రధానకార్యదర్శిగా కె.సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా బాలకోటయ్య, కోశాధికారిగా ఎస్.రవితో పాటు మరో 45 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమలో గౌరవ సలహాదారులు పొన్నూరు శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, వై.కొండల్, జి.శేషయ్య, యు.భాస్కర్, తిరుపతయ్య, డీఎల్.ప్రసాద్, సీహెచ్.జయప్రకాష్, వినోద్‌బాబు, వి.వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, మస్తాన్‌రావు, వై వెంకట్రావు, వీరాంజనేయులు, వీరారెడ్డి, పేరయ్య పాల్గొన్నారు.

వసతిగృహాల్లో వసతులను కల్పించాలి

ఒంగోలు(కలెక్టరేట్), డిసెంబరు 31 : ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్స్‌లో వసతులు కల్పించకపోతే ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడించాల్సి వస్తోందని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ హెచ్చరించారు. ఒంగోలులోని జేఏసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. సన్న బియ్యం అమలు చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చి నాలుగున్నరేళ్ళు గడుస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. జగనన్న మెనూ పేరుతో ప్రజలను మభ్యపెట్టేలా ఉందే తప్ప కనీసం సంక్షేమ హాస్టళ్ళల్లోమంత్రులు, అధికారులు ఒక్క రోజు నిద్ర చేసి వారి సమస్యలు తెలుసుకున్న పరిస్థితి లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కంచాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని హె చ్చరించారు. కార్యక్రమంలో పి.కార్తీక్, కరుణాకర్, సూర్య ప్రకాష్, శ్రీకృష్ణ, రాము, శ్రీనివాస్, అశోక్, రాజీవ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

210 మందికి వైద్యపరీక్షలు



వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), డిసెంబరు31: ఉప్పుగుండూరు గ్రామపం చాయతీ కార్యాలయంలో ఆదివారం స్టార్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 210మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.లలిత్‌రెడ్డి, కేవీఎల్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం



జెండాను ఆవిష్కరించిన నాయకులు

మద్దిపాడు, డిసెంబరు 31: సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం మద్దిపాడులో ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటర్లో జెండా ఆవిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా నాయకుడు ఉప్పుటూరి ప్రకాశరావు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సీపీఐ అండగా నిలుస్తుందన్నారు. పేద ప్రజలకు అండగా నిలిచి అనేక పోరాటాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పావులూరి అంజయ్య, టి.వెంకటశేషయ్య, నాగండ్ల వెంకటేశ్వర్లు నలజర్ల శ్రీనివాసరావు, నాతాని కోట్లింగం పాల్గొన్నారు.

నటుడు వెంకటశేషయ్యకు నంది పురస్కారం



అవార్డును అందుకుంటున్న వెంకటశేషయ్య

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 31: ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలుకు చెందిన ఉన్నం వెంకట శేషయ్యకు రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు లభించింది. రాష్ట్ర ప్రభుత్వ సినిమా, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ(ఏపీ ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో డిసెంబరు 23 నుంచి 29వ తేదీ వరకు గుంటూరులో నంది నాటక పోటీలను నిర్వహించింది. ఈ పోటీలలో కొప్పోలు పండు క్రియేషన్స్ సంస్థ పక్కింటి మొగుడు నాటకాన్ని ప్రదర్శించగా అందులో వెంకటశేషయ్య సీతాపతి పాత్ర పోషించారు. ఈ పాత్రలో అతని నటనకు గాను ఉత్తమ హాస్యనటుడు విభాగంలో నంది అవార్డు లభించింది. ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి చేతులమీదుగా వెంకటశేషయ్య నంది పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కాగా వెంకటశేషయ్యకు పురస్కారం లభించటం పట్ల ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు అభినందనలు తెలిపారు.











6నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన

దర్శి, డిసెంబరు 31 : సంక్రాంతి పండుగ సందర్భంగా జనసేన పార్టీ, గరికపాటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఈనెల 6వ తేదీ నుంచి దర్శిలో నిర్వహిస్తున్నట్లు దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ తెలిపారు. జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు నాలుగు కేటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పోటీలు 6వ తేదీన నాలుగు పళ్ల విభాగం ఎడ్లు, 7వ తేదీన ఆరు పళ్ల విభాగం ఎడ్లు, 8వ తేదీన న్యూ క్యాటగిరీ ఎడ్లు, 9వ తేదీ సీనియర్ క్యాటగి రీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన సీనియర్ కేటగిరి ఎడ్ల విజేతల కు ప్రథమ బహుమతిగా మహేంద్ర 475 డీఐ ట్రాక్టర్, రెండవ బహుమతిగా రూ.1.50 లక్షలు, మూడవ బహుమతి గా రూ.1.20 లక్షలు, నాల్గవ బహుమతిగా రూ.లక్ష, ఐదవ బహుమతిగా రూ.20 వేలు, ఆరవ బహుమతిగా రూ.70 వేలు, ఏడవ బహుమతి రూ.60 వేలు, 8వ బహుమతిగా రూ.50వేలు, తొమ్మిదవ బహుమతి రూ.40 వేలు అందించటం జరుగుతుందన్నారు. న్యూ క్యాటగిరీ విభాగంలో గెలుపొందిన ఎడ్లకు ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్ సైకిల్, రెండవ బహుమతిగా రూ.90వేలు, మూడవ బహుమతిగా రూ.80 వేలు, నాల్గవ బహుమతిగా రూ.70 వేలు, ఐదవది రూ.60 వేలు, ఆరవ బహుమతిగా రూ.50 వేలు, ఏడవ బహుమతిగా రూ.40 వేలు, ఎనిమిదవ బహుమతిగా రూ.30 వేలు, తొమ్మిదవ బహుమతిగా నైజ20వేలను అందజేస్తారు. ఆరుపళ్ల విభాగంలో విజేతలకు వరుసగా ప్రథమ రూ.60వేలు, ద్వితీయ రూ.50వేలు, తృతీయ రూ.40వేలు, చతుర్థ రూ.30 వేలు, పంచమ రూ.25వేలు, ఆరవ రూ.20వేలు, ఏడవదిగా రూ.15 వేలు, ఎనిమిదవ రూ.10వేలు, తొమ్మిదవ బహుమతిగా రూ.10వేలు, నాలుగు పళ్ల విభాగంలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ రూ.40వేలు, మాడవ రూ.30వేలు, నాల్గవ బహుమతి రూ.25వేలు, ఐదవ రూ.20వేలు, ఆరవ రూ.18వేలు, ఏడవ రూ.15 వేలు, ఎనిమిదవ రూ10వేలు, తొమ్మిదవ బహుమతిగా రూ.8వేలు అందిస్తున్నారు. పోటీల్లో పాల్గొన్న నాల్గు పళ్ల ఎడ్లకు, ఆరుపళ్ల ఎడ్లకు రూ.6వేలు చొప్పున బహుమతులు, న్యూ క్యాటగిరీ, సీనియర్ జతల ఎడ్లకు రూ.10వేల చొప్పున కన్సొలేషన్ బహుమతులు అందించడం జరుగుతుందని గరికపాటి వెంకట్ వివరించారు.

హామీల అమలులో వైసీపీ విఫలం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి, డిసెంబరు 31 : వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నవరత్నాల పేరుతో ప్రజలను ఘోరంగా మోసం చేశారని విమర్శించారు. నిరంతరం అబద్ధాలు చెప్తూ కాలం గడుపుతున్నారని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. జగన్ ఇచ్చిన హామీలను విఫలమైన వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను ఆయన ప్రదర్శించారు. పాలనలో జగన్ విఫలమైన తీరును ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, తెలుగు మహిళా నాయకురాలు ఎం.శోభారాణి, దర్శి పట్టణ క్లష్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, నాయకులు సంగా తిరుపతిరావు, పారా గాలయ్య, మారెళ్ల వెంకటేశ్వర్లు, కల్లూరి సుబ్బు, జూపల్లి కోటేశ్వరరావు, సైదారావు, దినకర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 10 కుటుంబాలు టీడీపీలో చేరిక

కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ఉగ్ర


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉగ్ర

వెలిగండ్ల, డిసెంబరు 31 : వెలిగండ్ల మండలానికి చెందిన వైసీపీ కుటుంబాలు ఆదివారం కనిగిరి టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వెలిగండ్ల గ్రామానికి చెందిన రాయళ్ల నరసింహులు, రాయళ్ల మాలకొండయ్య, బొప్పరాజు పుల్లయ్య, బొప్పరాజు చిన్న పుల్లయ్య, రాయళ్ల కాశీ, మరికొందరు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వారంతా టీడీపీలో చేరగా డాక్టర్ ఉగ్ర పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సలోమన్ రాజు, కారంపూడి వెంకటేశ్వర్లు, గొరిగే సుబ్రమణ్యం, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజు

వైసీపీ తీరును ఎండగట్టండి

పీసీపల్లి, డిసెంబరు 31 : ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జనసేన పార్టీ కనిగిరి నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ వరికూటి నాగరాజు, మండలపార్టీ అధ్యక్షుడు బండారు రా జులు అన్నారు. పీసీపల్లిలో ఆదర్శ్ కాలనీలోని సామాజిక భవనంలో జనసేన పార్టీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. పాదయాత్రలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న జగన్ అధికారంలోకి వచ్చి 5 సంవత్సరా లు అవుతున్నా సీపీఎస్ ను రద్దు చేయలేదన్నారు. నిరుద్యోగ యు వత ఉపాధి లేక కూలి పనులకు వెళ్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని వి మర్శించారు. త్వరలో జ రిగే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన,టీడీపీ కూటమి అత్యధిక సీట్లు విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏ ర్పాటు చేస్తుందని వారన్నారు. జన సైనికులు, వీరమహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీతో కలిసి వైసీపీ అవినీతి అక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని వారు అన్నారు. సమావేశంలో ప్రోగ్రామ్ కమిటీ కార్యద ర్శి రామిశెట్టి సునీల్, మాదాసు రమేష్, నాగేశ్వరరావు, రవి, వెంగళరావు, కుమార్, లక్ష్మయ్యకొంకల రామ్మోహన్, అ నిల్, కల్యాణ్, నరేష్, ఓ బులేసు, సాయికిరణ్, కి షోర్, అజయ్‌కుమార్, రామారావు, జనసైనికులు ఉన్నారు.

కోడిపందేలపై దాడులు

తాళ్లూరు, డిసెంబరు 31 : మండలంలోని లక్కవరం గ్రామ పొ లాల్లో కోడిపందేల స్థావరంపై ఎస్‌ఐ వైపీ రమణయ్య, ఎస్‌ఈబీ సి బ్బంది ఆదివారం దా డులు చేశారు. పందెం వే స్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంతో పా టు 6 పందెం కోళ్లు, రూ.5వేలను స్వాధీనం చేసుకున్నారు. వారిని దర్శి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధితుడికి రూ.25వేల సాయం

ముండ్లమూరు, డిసెంబరు 31 : నూజెండ్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పందిరి అనూష విద్యుత్ షాక్‌కు గురై శనివారం మృతి చెందగా, దర్శి నియోజక వర్గ జనసేన నాయకుడు వెంకట్ సోదరుడు గోపీ అనూష భర్త వెంకటేశ్వర్లును పరా మర్శించి రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.







మిర్చిని పీకేశారు

కురిచేడు, డిసెంబరు 31: పడమర వీరాయపాలెం గ్రామా నికి చెందిన ముతుకూరి చిన్న వెంకటేశ్వర్లుకు చెందిన మిర్చి చేలో గుర్తు తెలియని వ్యక్తులు మొక్కలు పీకి గుట్టలు వేశారు. రెండెకరాల పొలంలో మిర్చిని సాగు చేయగా అర ఎకరంలో పంటను కోసి గుట్టలు వేశారు. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆరగాలం కష్టపడి పంటను కాపాడుకుంటే పీకి వేయడం ఏంటని లబోదిబోమంటున్నారు.











కొనసాగుతున్న ఆందోళన



20వ రోజు సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

దర్శి, డిసెంబరు 31 : డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన 20వ రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కార్యకర్తలు ధర్నా చేశారు. కబడ్డీ ఆడుతూ జీతాలు పెంచాలంటూ కూతకూస్తూ ప్రభుత్వానికి సందేశమిచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు తిరుపతమ్మ మాట్లాడుతూ పండుగలు, సెలవదినాల్లో కూడా సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు 20 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా సీఎం జగన్‌రెడ్డికి పట్టకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు, పాదయాత్రలో హామీలు గుప్పించి నేనొస్తున్నానని, అన్ని సమస్యలు తీరుస్తానని మాటిచ్చి మడమతిప్పారని దుయ్యబట్టారు. సమస్యలు పరిష్కరించకపోగా వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు మహిళలని చూడకుండా అహంకార పూరితంగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. వెంటనే రూ.26వేలకు జీతం పెంచాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే పాలకులకు గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అచ్చమాంబ, బాలమ్మ, వెంకటరమణ, సుజాత, కె రంగమ్మ, పద్మావతి, ప్రభావతి, సీఐటీయూ నాయకులు సందు వెంకటేశ్వరరావు, యూ మోహన్‌రావు, టీ రంగనాయకులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ దుర్మార్గం

సీఐటీయూ నాయకులు కేశవరావు

కనిగిరి, డిసెంబరు 31 : మున్సిపల్ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆదివారం ధర్నా నిర్వహించారు. నగరంలో పారిశుధ్య పనులు చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను విధులకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులు నాయకుల మధ్య వాగ్వివాదం

మున్సిపల్ కార్మికులు సమ్మె కారణంగా విధులు నిర్వహించకపోవడంతో అధికారులు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వినియోగించి పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రయత్నిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. విధులకు వెళ్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను నాయకులు అడ్డుకోవడంతో వాగ్వివాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని చెప్పినా సమ్మె కార్మికులు వినలేదు. జనవరి 2 నుంచి సమ్మెకు మద్దతుగా పాల్గొంటామని ఔట్‌సోర్సింగ్ కార్మికులు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

మున్సిపల్ కమిషనర్‌గా రవీంద్ర



మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 31: మార్కాపురం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా దేవరకొండ రవీంద్ర ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు కార్పొరేషన్ కార్యాలయం నుంచి మార్కాపురం కమిషనర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ విజయవాడలోని సీఅండ్‌డీఎంఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు



లైట్లను ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి

మార్కాపురం రూరల్ డిసెంబర్ 31: పట్టణంలోని చెరువుకట్ట రోడ్డుపై ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ ఇస్మాయిల్, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయడంతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనను అంతంచేద్దాం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి
- ప్రజలు చంద్రబాబుకు మద్దతుగా ఉండేందుకు సమయం ఆసన్నమైందని పిలుపు

పొదిలి, డిసెంబరు 31 :వైసీపీ ప్రభుత్వ దుర్మార్గపు పాలనను అంతంచేద్దాం అని మార్కాపురం మాజీ శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్నది అభివృద్ధి పాలనకాదని రాక్షస పాలనని విమర్శించారు. జగన్‌రెడ్డి దుర్మార్గపు పాలన నుంచి ప్రజలను కాపడుకోవాల్సిన బాధ్యత టీడీపీ కార్యకర్తలపై ఉందన్నారు. నాలుగు సంవత్సరాల 9 నెలల పాలనలో జగన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని భూతద్దంలో పెట్టి వెతికినా కనపడని పరిస్థితి ఉందన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం చేతకాక వాయిదాల పర్వం నడిపిస్తున్నాడన్నారు. ఆరు నెలల క్రితం మార్కాపురం వచ్చిన అబద్ధాల ముఖ్యమంత్రి వెలుగొండను అక్టోబర్‌లో పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తానని చెప్పాడన్నారు. డిసెంబరు దాటినా ఆ ఊసే ఎత్తడం లేదని ఎద్దేవ చేశారు. నాడు పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వెంటనే వైన్‌షాపులు ఎత్తివేస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి ఇప్పుడు సొంత కంపెనీలతో సొంత బ్రాండ్లు తయారుచేసి అమ్ముతూ ప్రజల ప్రాణాలను నిలువున తీస్తున్నాడన్నారు. మార్కాపురం చెరువును ట్యాంక్‌బండ్ చేస్తానని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారాన్నారు. పొదిలి పెద్దచెరువు ద్వారా తాగునీటిని అందిస్తానన్న హామీ ఏమైందన్నారు. రాష్ట్రభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అమరావతి రాజధానిగా ఏర్పాటు చేసి చంద్రబాబు అభివృద్ధి చేస్తే ఇప్పుడు కక్షసాధింపుతో రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని చూపిస్తూ నూరుశాతం అభివృద్ధి చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో జరిగినన్ని భూదందాలు గతంలో ఎప్పుడు జరగలేదన్నారు. టీడీపీకి ప్రజలు ఓటుతో మద్దతుగా నిలిచే సమయం అసన్నం అయ్యిందన్నారు. ముందుగా నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాంకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల టీడీపీ అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, మోరబోయిన బాబురావు, పట్టణాధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మజీ జడ్పీటీసీ సభ్యుడు కాటూరి పెదబాబు, మాజీ సర్పంచ్ కాటూరి చినబాబు, జిల్లా కార్యదర్శి యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టీఎస్ఎస్ఎఫ్ గౌస్, మాజీ ఎంపీటీసీ డాక్టర్ ఇమాంమ్‌సా, లాయర్ షబ్బీర్, నాయకులు కాటూరి శ్రీను, యాసిన్, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బొడ్డు సుబ్బయ్య టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

పొదిలి : దళితులకు జగన్ తీరని అన్యాయం చేశారని వచ్చే ఎన్నికల్లో వైసీపీని పాతాళంలో తొక్కి య్యాలని మార్కాపురం మాజీ శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మోరబోయిన బాబురావు ఆధ్వర్యంలో కొనకనమిట్ల మండలంలోని నాగంపల్లి, బోడపాడు, గుర్రాలమడుగు ఎస్సీకాలనీల్లో దళితవాడల సందర్శన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి 'ఒక్కసారి అవకాశం' నినాదంతో మాయమాటలు చెప్పారన్నారు. 2024లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో పలు కుటుంబాల చేరిక



టీడీపీలో చేరిన కార్యకర్తలతో ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు, డిసెంబరు 31 : మండలంలోని కొంగలవీడు పంచాయతీలో టైలర్స్ కాలనీకి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో అశోక్‌రెడ్డి విజయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు వలి, నాగూర్‌వలి ఆధ్వర్యంలో వీరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరిలో పి.రాజగోపాల్, షేక్ షర్మిల, షేక్ ఫరీదా, షేక్‌పర్వీన్, షేక్ హుస్సేన్‌బీ, సయ్యద్ కరీముల్లా, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుంకయ్య, నాయకులు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆరవీటికోట గ్రామంలో...

రాచర్ల : మండలంలోని ఆకవీడు పంచాయతీ పరిధిలోని ఆరవీటికోట గ్రామంలో మిట్టమీదిపల్లె పాలేనికి చెందిన యువకులు టీడీపీలో చేరారు. శనివారం రాత్రి ఆరవీటికోట గ్రామంలో టీడీపీ నిర్వహించిన కార్యక్రమంలో గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మిట్టమీదిపల్లె పాలేనికి చెందిన దాదాపు 50 మంది యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.టీడీపీలో చేరిన వారిలో ఆకవీడు నవీన్, లింకన్, మార్క్, కిశోర్, నరేష్, మోహన్‌రావు, బాబ్జి, ప్రదీప్, అశోక్, కిరణ్, డేవిడ్, వెంకటయ్య, చరణ్, ప్రవీణ్, సురేష్, బన్నీ, ప్రసాద్, చిట్టిబాబు, కుమార్‌బాబు తదితరులు చేరారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

గిద్దలూరు : స్థానిక టీడీపీ కార్యాలయంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. టీడీపీ శ్రేణులు సమక్షంలో కార్యాలయానికి వచ్చిన కేక్‌ను మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కట్ చేసి పంచిపెట్టారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షులు సయ్యద్ షాన్షావలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

గిద్దలూరు, డిసెంబరు 31 : డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులు ఆదివారం పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మెను విరమించబోమని ప్రకటించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మురళీ, నాగయ్య, మౌలాలి, మస్తాన్‌రెడ్డి, పాపయ్య, సీఐటీయూ నాయకులు నరసింహులు, ఆవులయ్య శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్ : సమస్యలు పరిష్కరించాలంటూ మార్కాపురం మున్సిపల్ కార్యాలయం ఎదురు కాంట్రాక్ట్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం, హెల్త్‌అలవెన్స్, అన్నిరకాల పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, ఇమాంసా, నాసరయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పొదిలి : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నగరపంచాయతీ కార్మికులు ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను జగన్మోహన్ రెడ్డి నెరవేర్చకుండా చేశామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఐదేళ్ల క్రితం పాదయాత్రలో ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని తాము సీఎం జగన్మో హన్‌రెడ్డిని కోరుతున్నా మన్నారు. కార్మికులకు జీవో నెంబరు 25 ప్రమాదబీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 32 నెలలుగా జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



గిద్దలూరులో టోపీలతో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 31: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఆటపాట కార్యక్రమం నిర్వహించారు.

పెద్ద దోర్నాల : చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండు వద్ద గత ఇరవై రోజులుగా తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నిరవదిక సమ్మె నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త సంవత్సరం లోనైనా ముఖ్యమంత్రి సాను కూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించా లని కోరుతున్నారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మీ, షేక్ ముంతాజ్‌బేగం, పద్మ, వెంకటరత్నం, సుబ్బమ్మ పాల్గొన్నారు.

గిద్దలూరు : అంగన్‌వాడీల సమ్మె 20వ రోజుకు చేరింది. నెత్తిన తెల్ల టోపీలు ధరించి కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైసీపీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ముంచిందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కొండారెడ్డి శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణ, వరలక్ష్మి, విజయలక్ష్మి, టీడీపీ నాయకులు ఆవులయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నిలుపుకోవాలి

పొదిలి : సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిర్వధిక సమ్మె 20వరోజు కొనసాగుతుంది. ఆదివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని నూతన సంవత్సరంలోనైనా జగన్‌మోహన్‌రెడ్డికి ఆ భగవంతుడు మంచి మనసు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఇచ్చిన హామీల పరిష్కారం దిశగా వైసీపీ ప్రభుత్వం అడుగులు వేయకుండా కక్షసాధింపుకు దిగుతోందన్నారు.. పాదయాత్ర హామీలు అమలు చేయాలన్నారు.

వృత్తిపట్ల నిబద్ధత ఉన్న వ్యక్తి సుభానీ

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 31: వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావం, నిజాయితీ గల వ్యక్తి పోస్టల్ సుభానీ అని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసిన సయ్యద్ సుభానీ ఉద్యోగ విరమణ సభ పోస్టల్ రిక్రియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ మొదటి నుంచి సేవా దృక్పథంతో సుభానీ పనిచేశారన్నారు. తన మిగిలిన జీవితాన్ని ప్రజా సేవలో పాలుపంచుకోవాలన్నారు. పలువురు పోస్టల్ ఉద్యోగులు, ప్రముఖులు సుభానీని సన్మానించారు.

బెల్లం ఊట ధ్వంసం



బట్టీని ధ్వంసం చేస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల, డిసెంబరు 31: మండలంలోని పెద్ద మంతనాల, పనుకుమడుగు, తిమ్మాపురం గ్రామాలలో పోలీసు, సెబ్ అధికారులు ఆదివారం విస్తృత దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేసి అందుకు వినియోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1900 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. ఈ దాడుల్లో దోర్నాల ఎస్సై అంకమరావు, సిబ్బంది సెబ్ అధికారులు పాల్గొన్నారు.

సారాబట్టీ ధ్వంసం

గిద్దలూరు టౌన్ : మండలంలోని ఓబులాపురం తాండా సమీప అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లంఊటను, బట్టీని ఎస్‌ఈబీ అధికారులు ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ అరుణకుమారి, ఎస్సై మహేష్, పోలీసులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో యువకుడి అరెస్టు

మార్కాపురం రూరల్ డిసెంబర్ 31: మండలంలోని రాయవరం గ్రామంలో ఈ నెల 28న ఓ వృద్ధురాలపై అత్యాచారానికి పాల్పడిన దేవండ్ల కమల్నాథ్ అనే యువకుడిని మార్కాపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ వీర రాఘవరెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. దేవండ్ల కమల్నాథ్ అనే యువకుడు వృద్ధురాలపై అత్యాచారం చేసి పరారీలో ఉన్నాడు. మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి గాలిచారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో నిందితుడిని రాయవరం గ్రామంలో అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ వెల్లడించారు. అనంతరం నిందుతుడిని న్యాయాధికారి ముందు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ మద్యం సీసాల పట్టివేత

పొదిలి, డిసెంబరు 31 : తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ వెంకటసైదులు సిబ్బందితో దర్శి పొదిలి ప్రదాన రహదారి వెంబడి హైదరాబాద్ నుండి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌ను బస్సులను తనిఖీ చేశారు. అందులో అక్రమంగా తరలిస్తున్న అక్రమ మద్యం 16 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 31: రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో 2024 నూతన క్యాలెండర్‌ను సంఘం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ లక్ష్యం దిశగా మందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. సంఘం బలోపేతానికి కృషిచేయాలన్నారు.కార్యక్రమంలో కేవీ నరసింహారెడ్డి, టీవీ రమణారెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యూ.. జోష్

- యువత సందడే సందడి
- నూతన సంవత్సరానికి ఘన స్వాగతం
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు.. ఆలయాల్లో పూజలు

బాపట్ల, డిసెంబరు 31: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి న్యూ జోష్ నెలకొంది. యువత కేరింతలు.. సంబరాలు.. కేక్ కటింగ్‌లు.. బాణ సంచా కాలుస్తూ సందడి చేసింది. పల్లె పట్టణం అన్న తేడా లేకుండా జిల్లా అంతటా నూతన సంవత్సర సందడి నెలకుంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు కొత్త సంవత్సరానికి జిల్లావాసులు ఘనంగా స్వాగతం పలికారు. యువకులు నయా జోష్‌తో సందడి చేశారు. మహిళలు రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. విద్యాసంస్థల్లో నూతన సంవత్సర వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి, వేమూరు, పర్చూరు పట్టణాల్లో యువకుల కోలాహలం నెలకుంది. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చర్చిలు, వ్యాపార, విద్యా సంస్థలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొనుగోలుదారులతో స్వీట్స్ షాపులు, బేకరీలు కిటకిటలాడాయి. కేక్‌ల కొనుగోలుకు బంపర్ ఆఫర్లు ఇచ్చారు. రెస్టారెంట్లలో కూడా ఆఫర్లు ఇచ్చారు. యువకులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ ఒకరి కొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ రోడ్లపై సందడి చేశారు. పోలీసులు శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఆంక్షలు విధించినా యువత సందడి ఏమాత్రం తగ్గలేదు. పోలీసులు పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు.


కేక్‌ల వద్ద కొనుగోలు దారుల సందడి

తాగండి.. తూగండి..



- అమ్మకాల పెంచేలా మద్యం పాలసీ
- ధరలు తగ్గింపు.. అందుబాటులో షాపుల ఏర్పాటు
- రెండు నెలల్లో రెండు సార్లు ధరలు తగ్గించిన ప్రభుత్వం
- నిషేధంపై మడమ తిప్పి మందుబాబులకు ప్రోత్సాహం
- నూతన సంవత్సరాది రెండు రోజులు రాత్రి 12 వరకూ మద్యం షాపులు

తాగండి.. తూగండి.. ఖజానాను గలగలలాడించండి.. ధరలు ఎక్కువగా ఉన్నాయా అయితే తగ్గిస్తాం.. మద్యం ఎక్కడ కావాలంటే అక్కడ అందుబాటులోకి తెచ్చాం.. వైన్స్, లిక్కర్ మార్ట్‌లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశాం.. తాగడం మాత్రం మానొద్దు. నూతన సంవత్సరం సందర్భంగా దుకాణాల వేళలు కూడా పెంచాం.. బాగా తాగండి. మద్య నిషేధం చేస్తానని మహిళలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక వైసీపీ అధినేత జగన్ ఆ హామీని తుంగలో తొక్కారు. మద్య నిషేధం మాటను పక్కనబెట్టి మద్యం తాగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉంది. అధికారం చేపట్టిన తొలి రెండేళ్లలో మద్య నిషేధం పేరుతో నానా హడావుడి చేసిన ప్రభుత్వం ఆ తర్వాత మద్యం తాగిం చడమే ధ్యేయమన్నట్లుగా మద్యం పాలసీ ప్రవేశపెట్టింది. మద్యం అమ్మకాలు పెంచడానికి పడరాని పాట్లు పడుతోంది.

రాత్రి 12 వరకూ మద్యం షాపులు

ప్రజలను తాగించడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం కొత్త సంవత్సర వేడుకలను సద్వినియోగం చేసు కునే పనిలో పడింది. మద్య నిషేధం సంగతే మోగాని కొత్త సంవత్సరం వేడుకల్లో మద్యాన్ని పారిం చేందుకు అన్ని విధాలా ఏర్పాట్లు చేసింది. డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో అర్ధరాత్రి 12 గంటల వరకూ చర్యలు తీసుకుంది. ఆ మేరకు షాపులు తెరిచి ఉంచేందుకు మూడు జిల్లాల ఎక్సైజ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మద్యం, బీరు కొరత రాకుండా ముందుగానే షాపులను సరుకుతో నింపేశారు.

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మద్య నిషేధంపై మాట తప్పి, మడమ తిప్పిన విషయాన్ని పక్కనపెట్టి మందుబాబులను ప్రోత్సహిస్తోంది. మందుకు దూరమైన వారిని కూడా తిరిగి రాబట్టాలనే ఉద్దేశంతో ఎప్పటికప్పుడు దుకాణాలు పెంచుతూ, ధరలు తగ్గిస్తూ మందుబాబులకు ఎరవేస్తోంది. గడిచిన రెండు నెలల్లోనే రెండుసార్లు మద్యం ధరలు తగ్గించి నిషేధ లక్ష్యానికి తూట్లు పొడుస్తోంది. వైసీపీ అధికారంలోకి రావడంతోనే పేదల కష్టార్జితాన్ని కొల్లగొట్టే పనిలోపడింది. ధరలు పెంచితే మద్యం తాగడం మానేస్తారని వంక పెట్టి మందు ధరలు పెంచి కష్టజీవుల ఆదాయాలను లూటీ చేస్తోంది. రోజంతా కష్టపడి సంపాదించిన కష్టార్జితం ఇల్లాలి చేతికి వెళ్లకుండానే మద్యం షాపుల్లో జమ చేసేసుకుంది. నాలుగున్నరేళ్లుగా నిషేధంపై మాయమాటలు చెబుతున్న ప్రభుత్వం మద్యం అమ్మకాలు తగ్గినప్పుడల్లా ధరలు తగ్గించి మందుబాబులను తెగ తాగించడమే పనిగా పెట్టుకుంది. గడిచిన నాలుగున్నరేళ్లలో రెండు సార్లు మద్యం షాపులు తగ్గించి నిషేధంపై హడావుడి చేసిన ప్రభుత్వం, వాక్-ఇన్, టూరిజం స్టోర్లు, మాల్స్ పేరిట ఇప్పటికి మూడుసార్లు షాపులు పెంచి, రెండు సార్లు బార్లకు అనుమతులు ఇచ్చి, మూడుసార్లు మద్యం ధరలు తగ్గించి మందుబాబులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం తాజాగా మరోమారు మద్యం ధరలు తగ్గించి నిషేధానికి మరోమారు తూట్లు పొడించింది. అమ్మకాలే లక్ష్యంగా ప్రభుత్వం మద్యం ధరలు తగ్గిస్తూ వస్తోంది.

అమ్మకాలు తగ్గినప్పుడల్లా ధరలు తగ్గించి మందు బాబులు మద్యానికి దూరమవ్వకుండా జాగ్రత్త పడుతోంది. మద్యం ధరలు భారీగా పెంచిన తొలి నాళ్లలో అమ్మకాలు భారీగా తగ్గాయి. దీంతో ప్రభుత్వం నిషేధ హామీకి తూట్లు పొడిచి 2020 అక్టోబరులో మద్యం ధరలను 25 శాతం తగ్గించింది. 2021 డిసెంబరులో ధరలను మరోమారు క్రమబద్ధీకరించి టాక్సులు తగ్గించింది. తిరిగి మద్యాన్ని ఏరులై పారించింది. కష్టజీవుల ఆదాయాన్ని అడ్డూ అదుపు లేకుండా కొల్లగొట్టింది. కార్తీకమాసం ప్రభావం, పండుగల నేపథ్యంలో భక్తుల మాలధారణల నేపథ్యంలో మద్యం అమ్మకాలు కొంతమేర తగ్గాయి. ఆ మాత్రం అమ్మకాలు తగ్గడం కూడా ఇష్టపడని ప్రభుత్వం ఈ నవంబరు 18న ధరలు తగ్గించింది. ధరల క్రమబద్ధీకరణ పేరుతో నాశిరకం బ్రాండ్ల ధరలు తగ్గించి, బ్రాండెడ్ మద్యం ధరలను మాత్రం భారీగా పెంచారు. నాశిరకం మద్యం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుండడం తో అమ్మకాలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. దీంతో ప్రభుత్వం 40 రోజుల వ్యవధిలోనే మరోమారు మద్యం ధరలు తగ్గించింది. ధరల సవరణ పేరుతో 15 రకాలు స్కాచ్, విస్కీల ధరలను మదింపు చేసిన ప్రభుత్వం ఒకటి రెండు బ్రాండ్లకు ధరలను పెంచి, మిగిలిన అన్ని బ్రాండ్లకు ధరలు భారీగా పెంచింది. దీంతో మద్య నిషేధంపై తనకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని తేల్చి చెప్పింది. మద్య నిషేధం చేసే ఓట్లడుగుతానని గత ఎన్నికల ప్రచారంలో మైకుల్లో హోరెత్తించిన ముఖ్యమంత్రి ప్రజలు ఆ మాట మర్చిపోయారన్న ప్రగాఢ విశ్వాసంతో నిషేధం చేయకుండానే ఓట్లడిగేందుకు ప్రజల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

మద్యం ధరల వివరాలు

బ్రాండు పేరు	పాత ధర	కొత్త ధర
కెటెల్ వన్ ఓడ్కా	3,190	2,730
జే అండ్ బీ రేర్	3,130	2,650
జానీవాకర్స్ రెడ్‌లేబుల్	2,760	2,440
బీఫ్ఈటర్ లండన్ జిన్	2,450	2,080
అబ్సొల్యూట్ ఓడ్కా	2,510	2,180
అబ్సొల్యూట్ సిట్రోన్	2,590	2,240
జామ్సన్ ఐరిష్ విస్కీ	2,840	2,530
చివాస్ రీగల్ స్కాచ్	4,840	4,780
జానీవాకర్ బ్లాక్‌లేబుల్	4,490	4,950

అది అక్రమమే.. సక్రమం చేయండి

- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ, దస్త్రాలు పట్టుకుని ప్రదక్షిణలు చేస్తున్న అక్రమ భవన నిర్మాణ ప్రతినిధులు
- తమకు రాజకీయ అండ ఉందని ప్రచారం చేసుకుంటున్న సదరు ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 31: అది అసైన్డ్ స్థలం. ఆ స్థలం కొనకూడదు. కాని కొన్నారు. ఆ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మింపచేశారు. అందులో లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరిట కార్యకలాపాలు కూడా సాగిస్తున్నారు. ఇదేదో మారుమూల ప్రాంతంలో కాదు. చీరాల, కారంచేడు రోడ్డులో హైలెవల్ బ్రిడ్జి పక్కన. అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి, భారీ భవన నిర్మాణం చేశారు. ఈ తతంగం జరిగి సుమారు దశాబ్దన్నర కాలం అవుతోంది. అయితే ఆ అసోసియేషన్‌లో వచ్చిన కలతల నేపథ్యంలో అసోసియేషన్‌లో జరుగుతున్న అక్రమాలు, అసైన్డ్ భూమి కొనుగోలు, భవన నిర్మాణం తాజాగా వెలుగులోకి వచ్చింది. సుమారు ఈ ఏడాదిన్నర కాలంగా ఈ రచ్చ రగులుతోంది. ఓ దశలో అనుకూలంగా కొందరు, ప్రతికూలంగా మరి కొందరు పట్టణంలో ర్యాలీలు, ధర్నాలు కూడా చేశారు. ఈ క్రమంలో ఈ అక్రమ వ్యవహారం కొంతమేర రాజకీయరంగు పులుముకుంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన స్థలం కొనుగోలు, భవన నిర్మాణాన్ని సక్రమం చేయించుకునేందుకు అందుకు సంబంధించిన వ్యక్తులు కొందరు ఇటు తహసీల్దార్ కార్యాలయం, అటు మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అందుకు అవసరమైతే పెద్ద మొత్తంలో దక్షిణ కూడా ఇస్తామని అధికారులకు ఎరవేస్తున్నారని సమాచారం. పాలక, ప్రతిపక్షాల నుంచి పూర్తి స్థాయిలో రాజకీయ అండ ఉందని నమ్మించి అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు.


నిబంధనలకు విరుద్ధంగా చీరాల, కారంచేడు రోడ్డులో నిర్మించిన భవనం

మున్సిపల్ ఖజానాకు రూ.లక్షల్లో నష్టం

మున్సిపల్ పరిధిలో ఏ నిర్మాణం చేయాలన్నా ముందస్తుగా అనుమతి తప్పనిసరి. అది జరగలేదు. దీంతో ఇన్ని సంవత్సరాలు రూపాయి టాక్స్ కూడా చెల్లించలేదు. దీంతో లక్షల్లో మున్సిపాలిటీ ఖజానాకు నష్టం. ఇక ఆ భవనంలో జరిగే లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ కూడా మాయేనని, ఆ క్రమంలో కూడా ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము చెల్లించటం లేదనే ఆరోపణలున్నాయి. సదరు అక్రమ నిర్మాణానికి సంబంధించి ముందస్తుగా నోటీసులు ఇచ్చి స్పందించకుంటే కోర్టుకు వెళ్తామని, అవసరమైతే కూల్చివేతకు చర్యలు చేపట్టాల్సి వస్తుందని గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అయితే ఆ తరువాత చర్యలు నోటీసులకే పరిమితమయ్యాయనే ఆరోపణలున్నాయి. అందుకు కారణం ఏమిటనేది తెలియదు.

పరిశీలించి తగిన చర్యలు చేపడతాం

సదరు భవన నిర్మాణం జరిగిన ప్రదేశం అసైన్డ్ అని మాకందిన ఫిర్యాదుల ద్వారా తెలిసింది. అసైన్డ్ భూమి కొనుగోలు చట్టవిరుద్ధం. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- ప్రభాకరరావు, తహసీల్దార్, చీరాల మండలం



వైసీపీని.. వీడుతున్నారు

- వేమూరులో అసమ్మతి జ్వాలలు
- ద్వితీయ శ్రేణి నేతల రాజీనామాల బాట
- తెరపైకి వస్తున్న మంత్రి నాగార్జున బాధితులు
- మేరుగ ఇబ్బంది పెట్టారని రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాజీనామా
- మూడు గ్రామాలకు చెందిన నాయకులూ మురళీకృష్ణ బాటలో

బాపట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్నాయి.. ఈ తరుణంలో నేతలు గెలుపు కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలి.. కాని అధికార వైసీపీలో అసమ్మతి జ్వాలలు రగులుతున్నాయి. ప్రధానంగా వేమూరు నియోజకవర్గంలో తాజాగా పలువురు రాజీనామాల బాట పట్టడంతో వైసీపీలో కలకలం రేగింది. ఇప్పటికే ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకతను తప్పించుకోవడానికి వేమూరు ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున ప్రకాశం జిల్లా కొండపికి మారిన సంగతి తెలిసిందే. అయినా మంత్రిపైన అసమ్మతి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. నాలుగున్నరేళ్లలో ఆయన పెట్టిన ఇబ్బందులకు బాధితులుగా మిగలామంటూ అధికార పార్టీకి చెందిన వారే ఒక్కొక్కరిగా తెరమీదకు వస్తున్నారు. వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వేమూరికి చెందిన మురళీకృష్ణ ఆదివారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు నియోజకవర్గం పరిధిలోని బలిజేపల్లి, వరాహపురం, అబ్బనగూడవల్లి గ్రామాలకు చెందిన నాయకులు కూడా పార్టీని వీడటం చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా మంత్రి లక్ష్యంగా మురళీకృష్ణ పలు విమర్శలను ఎక్కుపెట్టారు. పార్టీ కోసం పనిచేసిన వారిని ఇబ్బంది పెడుతూ, పనిచేయని వ్యక్తులను పార్టీలోనికి ఆహ్వానించి అందలం ఎక్కించారని మంత్రిపై మండిపడ్డారు. పదేళ్లుగా వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పార్టీ అభివృద్ధికి ఎంతో కష్టపడ్డానని, కానీ తనకు అవమానాలు మాత్రమే మిగిలాయని వాపోయారు. అభివృద్ధి లేని చోట తాము ఉండకూడదన్న నిర్ణయానికి వచ్చి రాజీనామాలు చేస్తున్నామని మురళీకృష్ణ ప్రకటించారు. మంత్రి వ్యవహారశైలితో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, భరించలేకే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. పార్టీని వీడిన వారిలో మురళీకృష్ణతో పాటు నాయకులు కస్తూరి బాబురావు, పంచాయతీ వార్డు సభ్యులు వల్లభాపురం లీలాకృష్ణ, లావు బోసు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, చిలక రాజేశ్‌రాంబాబు తదితరులు ఉన్నారు.

మంత్రి తీరుపై ఆగ్రహం..

మంత్రి చేసిన తప్పిదాలు సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను వేధించిన ఉదంతాలు కోకొల్లలుగా ఉండటంతో ఒక్కొక్కరుగా బయటకు వచ్చి ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నారు. దీనికి తోడు కొత్త ఇన్‌చార్జిగా నియమితుడైన వరికూటి అశోక్‌బాబుకు సైతం శ్రేణుల నుంచి మద్దతు లభించడం లేదు. రాబోయే రోజుల్లో ఈ రాజీనామాల పర్వం ఊపందుకుని అసమ్మతి జ్వాలలు మరింతగా ఎగిసిపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దేవినేని ఫ్లెక్సీల కలకలం

భట్టిప్రోలు మండలం వరికూటివారి పాలెంలో ఆదివారం దేవినేని మల్లికార్జునరావు ఫొటోతో వెలిసిన ఫ్లెక్సీలు కలకలం సృష్టించాయి. రేపల్లె మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బుడా(బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట అథారిటీ) ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైసీపీ నేత దేవినేని మల్లికార్జునరావు ఫొటోలతో వేసిన టీడీపీ ఫ్లెక్సీలు సంచలనమైంది. మాజీ ఎమ్మెల్యే దేవినేనికి వేమూరి నియోజకవర్గంలో గణనీయంగా ఓట్లు ప్రభావితం చేయగల నేతగా పేరుంది. 2019 ఎన్నికల్లో మంత్రి మేరుగ గెలవడానికి ప్రధాన కారణం కూడా ఆయనేనన్న చర్చ ఉంది. ప్రస్తుతం టీడీపీ ఫ్లెక్సీల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఫొటోల సరసన దేవినేని ఫొటో ఉండటం, రాబోయే రోజుల్లో రాజకీయంగా ఆయన అడుగులు కూడా టీడీపీ వైపేనన్న చర్చ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే దేవినేనికి ఎంపీ మోపిదేవికి మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి.


కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

హత్య కేసులో నిందితుల అరెస్టు

- భార్యతో వెట్టిచాకిరి చేయిస్తున్నాడని హతం

తెనాలి రూరల్, డిసెంబరు 31: ప్రేమించి పెళ్లి చేసుకున్న కుమార్తెతో వెట్టిచాకిరి చేయిస్తున్న అల్లుడ్ని హత్య చేసిన బంధువుల్ని పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి మండలం కఠెవరంలో ఈ నెల 25న జరిగిన హత్య కేసులో నిందితులను ఆదివారం రూరల్ సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో హాజరుపరిచి కేసు వివరాలను డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. పెయింటింగ్ పని చేసే తెనాలి మండలం కఠెవరానికి చెందిన గేర వాసు నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన వెన్నెలను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల వాసు తల్లికి పక్షవాతం వచ్చింది. ఈ క్రమంలో వెన్నెలను చూసేందుకు వచ్చిన తండ్రి అబ్రహంకు చాకిరి చేస్తున్న కూతురును చూసి అల్లుడ్ని ప్రశ్నించాడు. వాసు మామపై కోపగించుకుని తిడుతూ అయన్ను ఇంటి నుంచి గెంటేశాడు. ఆయన అదే గ్రామంలో ఉంటున్న బంధువు మేరి ఇంటి వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని తెలిపాడు. దీంతో మేరి భర్త, వారి బంధువులు వాసు ఇంటికి వెళ్లగా వారి మధ్య ఘర్షణ జరిగింది. కత్తి, స్క్రూడ్రైవర్‌తో వాసును పొడవడంతో గాయపడిన వాసును ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అబ్రహం బంధువుల దాడిలో వాసుకు మామ వరసయ్యే తిరుపతిరావు గాయపడగా వాసు సోదరుడు గోపి పారిపోయాడు. తిరుపతిరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారించిన రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు నిందితులైన తోకల అరవింద్‌నాగరాజు, మాతంగి ప్రకాష్‌తేజ, గోళ్ల జయంత్, కంచర్ల ప్రవీణ్, కోట రవి కుమార్, తోకల మేరి, తోకల ప్రసాదరావు, కొండ్రు జీవన్, కొండ్రు యేసోబులను అరెస్టు చేశారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

- ఏపీటీఎఫ్

బాపట్ల, డిసెంబరు 31: పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగా వరప్రసాదరావు డిమాండ్ చేశారు. బాపట్ల పెన్షనర్స్ అసోసియేషన్ హాలు నందు ఏపీటీఎఫ్ జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎ.శేఖర్‌బాబు అధ్యక్షత వహించగా వరప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, కరువు భత్యం బకాయిలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడుతూ పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జీవో నెంబరు 117ను రద్దు చేయాలన్నారు. ప్రధాన సంపాదకులు షేక్ జిలానీ మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా ఒక ఉపాధ్యాయ పోస్ట్ కూడా నియామకం జరగకపోవటం దారుణమన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టు లను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు చేస్తానన్న ప్రభుత్వం హామీని నిలుపుకోలేకపోవటం శోచనీయమన్నారు. ఇప్పటికైన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షుడు వై ఆంజనేయప్రసాద్, విజయసారధి, ఎంసీహెచ్ రాజారత్నం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాదరావు

చేనేతకు చేయూత: బలరాం

చీరాల, డిసెంబరు 31: నియోజకవర్గంలోని నేతన్నలను అన్నివిధాల బలోపేతం చేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. అందుకు సహకార ఉత్పత్తి, విక్రయ కేంద్రాలు దోహదపడతాయని చెప్పారు. మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీ అయోధ్యనగర్‌లో నూనతంగా ఏర్పాటుచేసిన శుభోదయం చేనేత పారిశ్రామికుల సహకార, ఉత్పత్తి, విక్రయ కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉన్న నేతన్నలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. పరస్పర సహకార సంఘాల చేయూతను సద్వినియోగం చేసకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, మాచర్ల మోహనరావు, మేడా వెంకట్రావు, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్, దేవన వీరనాగేశ్వరరావు, సజ్జా శ్రీనివాసరావు, కొలుకుల కుమార్, భూసం పుణ్యవతి, బాలసుబ్ర మణ్యం, తిరువీధుల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

దగ్గుబాడు (పర్చూరు), డిసెంబరు 31 : కారంచేడు మండలం దగ్గుబాడులో ప్రాణహిత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వారిచే మసీద్ సెంటర్ సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక చర్చి కాంపౌండ్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 250 మంది రోగులకు పరీక్షలు చేసినట్లు మండల కోఆప్షన్ సభ్యుడు ముల్లా నూర్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పృధ్వి, డాక్టర్ శివానీ రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గడ్డం ధర్మానందరావు, గడ్డం నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభలను జయప్రదం చేయాలి

అద్దంకి టౌన్, డిసెంబరు 31: తెలుగువైభవాన్ని చాటే 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు జనవరి 5,6,7 తేవాలలో రాజమండ్రిలో జ రుగుతాయ ని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ సభలలో కవులు, కళా కారులు పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. ఆదివారం రోటరీ క్లబ్ కా ర్యాలయంలో సాహితి మిత్ర మండలి ఆధ్వర్యంలో మహాసభలకు సంబం ధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలిరెడ్డి, శ్రీనివాసరావు, వీరయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఏలూరి

మార్టూరు, డిసెంబరు 31: మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ క్యాలెం డర్‌ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా తమ సమస్యలను ఏలూరి దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి కృ షి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు కె.పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

» నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య

చీరాల, డిసెంబరు 31: టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని 24వ వార్డు పార్టీ కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. వార్డు అధ్యక్షుడిగా వావిలపల్లి రమేష్, ఉపాధ్యక్షుడిగా కల్లేపల్లి రమణారావు, ప్రధాన కార్యదర్శిగా పోలాకి రమణ, ఇతర కార్యవర్గాన్ని నియమించారు. ఈ సం దర్భంగా కొండయ్య మాట్లాడుతూ వార్డులో టీడీపీని బలోపేతం చేయటంలో బాధ్యతలు స్వీకరించిన నాయకులు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

కార్యక్రమంలో నాయకులు గౌరీ అ మర్‌నాథ్, గజవల్లి శ్రీనివాసరావు, డేటా నాగేశ్వరరావు, లావేటి శ్రీనివాసతేజ, ఉసురుపాట సురేష్, గంజి పురుషోత్తమ్, కర్పూరపు సుబ్బలక్ష్మి, కొండ్రు రత్నబాబు, పైలా శ్రీనివాసరావు, గంగవ రపు వెంకన్న, పులిపాటి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతూ పట్టుబడ్డ విద్యుత్ సిబ్బంది

అద్దంకి, డిసెంబరు 31: అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలోని విద్యుత్ ఏఈ కార్యాలయంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేయటం తో నలుగురు సిబ్బంది పట్టుబడ్డారు. పోలీసుల కథనం మేరకు.. విద్యుత్ సిబ్బంది పేకాట ఆడుతుండగా ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు చేశారు. నలుగురు విద్యుత్ సిబ్బందిని అదుపులోకి తీసుకొని రూ.14,350 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. విద్యుత్ సిబ్బంది పేకాట ఆడుతూ పట్టుబడటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. నలుగురు సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్టు ఈఈ నల్లూరి మస్తానరావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అద్దంకి, డిసెంబరు 31: భార్య కాపురానికి రాలేదని యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన తన్నీరు ఆంజనేయులు(33)కు ముండ్లమూరు మండలం పోలవరంకు చెందిన యువతితో వివాహమైంది.

మనస్పర్థలతో ఐదు సంవత్సరాలుగా భార్య కాపురానికి రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుమందు తాగాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు గమనించి ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. రిమ్స్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆట, పాటలతో అంగన్‌వాడీల నిరసన

» 20వ రోజుకు చేరిన సమ్మె

» ప్రభుత్వ తీరుపై కార్యకర్తల ఆగ్రహం

చీరాల, డిసెంబరు 31: అంగన్‌వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం ఆట, పాటలతో నిరసన తెలిపారు. తమ న్యాయమైన కోర్కెలు సాధించుకునే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిల్చొని నిరసన

అద్దంకి టౌన్, డిసెంబరు 31: తమ సమస్యలు పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 20వ రోజుకు చేరుకుంది. స్థానిక తహసీల్ధార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం అంగన్ వాడీల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రభుత్వం దిగి వచ్చేవరకు పోరాడతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి.శారద, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

హామీలను అమలుచేయాలి

బల్లికురవ, డిసెంబరు 31: ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటపాటలతో నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుచేయలేదని, మాట తప్పటం మడమ తిప్పటం అంటే ఇదేనా అని వారు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

కార్య క్రమంలో సంఘ నేతలు నాగమణి, సరస్వతి, జ్యోతి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



చీరాలలో మ్యూజికల్ చైర్స్ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కాదని అంగన్‌వాడీలు విమర్శించారు. బెదిరింపులకు భయపడేది లేదని, పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఖోఖో ఆడుతూ అంగన్‌వాడీలు, ఆయాలు నిరసన తెలిపారు.

కార్యక్రమంలో మండల పరిధి లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కనీస వేతనం ఇవ్వాలి

చినగంజాం, డిసెంబరు 31: గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆది వారం 20వ రోజుకు చేరుకుంది. సమ్మెపై ప్రభుత్వం స్పందించకుండా మొండివైఖరిని ప్రదర్శించడం సరి



చినగంజాం: ఖోఖో ఆడుతూ నిరసన వ్యక్తంచేస్తున్న అంగన్‌వాడీలు

ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం కష్టపడి పనిచేయాలి



జనసేన నేతలతో ఈదర హరిబాబు

అద్దంకి, డిసెంబరు 31: అద్దంకి నియోజకవర్గంలో టీడీ పీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం కష్టపడి పని చేయాలని జడ్పీ మాజీ చైర్మన్, జనసేన నేత ఈదర హ రిబాబు అన్నారు. జనసేన నియోజకవర్గ నేతల సమావేశం ఆదివారం స్థానిక శ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వచ్చే వారం నుంచి మండలాల స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జనసేన నేతలు సాధు వెంకటేష్, గాదె రామాంజనేయులు, కొట్టే నరసింహ, కసుకుర్తి హనుమాన్, బత్తుల చందు, వినోద్, కాళీచరణ్, వెంకటరావు, అన్నాబత్తిన వెంకట్, తది తరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబాల్లో ఆనందం



బీరం సుందరరావును సన్మానిస్తున్న సృజన బృందం

అద్దంకి టౌన్, డిసెంబరు 31: అద్దంకి సాహిత్య సంపదను, చరిత్రను అమెరికాలో జరిగిన తానా మహాసభలలో పాల్గొని వివరించిన సాహితీవేత్త బీరం సుందరరావు అభినందనీయులని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో సృజన సాహిత్య సమావేశం గాదేపల్లి దివాకర్‌దత్తు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బీరం సుందరరావు తానా సభ విశేషాలను తెలియజేశారు. ఉమ్మడి కుటుంబాలకు దూరమయ్యేకొద్దీ ప్రపంచవ్యాప్తంగా మానవుడు ఆనందానికి, మనశాంతికి దూరమవుతున్నారని సుందరరావు అన్నారు. అమెరికాలో తరగతి గదులు, యూనివర్శిటీలలో లైబ్రరీలు ఎంతో ఆకర్షించాయన్నారు. అనంతరం సుందరరావును సృజన బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రావూరి రంగయ్య, పాలపర్తి జ్యోతిష్మతి, ఆర్వీ రాఘవరావు, శేషతల్పసాయి, వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య), మన్నం త్రిమూర్తులు, డీవీఎం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

7న తనికెళ్ళ భరణికి జీవిత సాఫల్య పురస్కారం

అద్దంకి, డిసెంబరు 31: పట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ జీవిత సాఫల్య పురస్కారం 2024ను కవి, నటుడు, సినీ రచయిత, నాటక రచయిత తనికెళ్ళ భరణికి అందజేయనున్నట్లు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. 800కు పైగా సినిమాలలో నటించటం, 52 చిత్రాలలో సంభాషణలు, రెండు చిత్రాలకు తనికెళ్ల దర్శకత్వం వహించారన్నారు. ఈనెల 7వ తేది ఉదయం 10 గంటలకు అద్దంకి పట్టణంలోని కామేపల్లి కల్యాణ మండపంలో పురస్కారం అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థినులకు మాదిరి ప్రశ్నపత్రాల పంపిణీ



గురుకుల పాఠశాల విద్యార్థినులకు మాదిరి ప్రశ్నపత్రాలను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి టౌన్, డిసెంబరు 31: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు మాదిరి ప్రశ్నపత్రాలను అందజేశారు. శంఖవరప్పాడుకు చెందిన సోము రమణారెడ్డి సహకారంతో శింగరకొండలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు మాదిరి ప్రశ్నపత్రాల బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, ప్రిన్సిపాల్ దుర్గాగాయత్రి, లేవి ప్రసాద్, నందిరెడ్డి శ్రీనివాసరావు, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జనకంటక పాలనకు స్వస్తి పలకాలి

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

» నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

అద్దంకి, డిసెంబరు 31: నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతనోత్సహం, నూతనోత్తేజం, నూతన ఆలోచనలతో జనకంటక పాలనకు స్వస్తి పలికేం దుకు మహిళలు, యువత నడుం బిగించి కదం తొక్కాల ని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో అన్నిరకాలుగా వైఫ ల్యం చెందిన రాష్ట్రాన్ని మళ్ళీ చక్కగా పరిపాలించి, గాడి తప్పిన పాలనను గాడిలో పెట్టే చంద్రబాబు మరలా ముఖ్యమంత్రిగా వస్తారని అన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో మంచి రోజులు వస్తాయని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల కోసం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి నిత్యం పరితపించే నిత్యశ్రామికుడు చంద్రబాబుకు తోడుగా నిల వాలని కోరారు.

భగవద్గీతతో పరిజ్ఞానం

బల్లికురవ, డిసెంబరు 31: ప్రతిరోజు భగవద్గీత చదవటం కాని, వినటం చేస్తే ప్రజలలో పరిజ్ఞానం పెరుగుతుందని చిలకలూరిపేటకు చెందిన ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు పేర్కొ న్నారు. ఆదివారం మండలంలోని చెన్నుపల్లి, కొండాయపాలెం గ్రామాలలో త్రైత సిద్ధాంతం ప్రభోద సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రజలకు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత గ్రంథాల గురించి వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు యద్దనపూడి రామాంజనేయులు, చిర్రా వెంక ట్రామిరెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ, పొట్లూరు పుల్లయ్య, స్వర్ణ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

చీరాల, డిసెంబరు 31: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికు లు చేపట్టిన సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. సం ఘీభావం తెలిపిన సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్.బాబూరావు మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులను కనిపించే దైవాలుగా పోల్చిన సీఎం జగన్, ప్రభుత్వ పాలకులకు వీరి డిమాండ్లను పరిష్కరించేందు కు మనసు రాకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఎందుకు ఇవ్వరని ప్రశ్నిం చారు.



చీరాలలో అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు



అద్దంకి: మున్సిపల్ కార్యాలయం వద్ద ఒంటికాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫె డరేషన్ పట్టణ అధ్యక్షుడు నూతలపాటి రాజు, కార్యదర్శి ఎండ్లూరి సింగయ్య, కోశాధికారి మానికల శంకర్, బడుగు కుమారి, గూడూరు కోటేశ్వరమ్మ, వై.సంధ్య, బి.విజయమ్మ, ఆంజనేయులు, రేణుమాల నాగరాజు, గూడూరు శిరీష, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుతోనే సమ్మె

అద్దంకి టౌన్, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. అద్దంకి మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కా ర్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి 6వ రోజుకు చేరు కుంది. అద్దంకి మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో కార్మికులు ఒంటి కాలిమీద నిల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, గాలి బీష్మా, బత్తులు కృష్ణ, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం సభకు ముమ్మర ఏర్పాట్లు

● పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, డిసెంబరు 31 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 5న చేపట్టనున్న శంఖారావం సభకు కనిగిరిలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణ సమీపంలోని చాకిరాల సమీపంలోని సభాస్థలం వద్ద ఏర్పాట్లలో భాగంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కొలతలు వేశారు. దాదాపు 2లక్షల మంది సభకు హాజరవుతారని అంచనా వేసి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అక్కడకు సమీపంలోనే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అదే ప్రాంతంలో భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఉగ్ర వెంట పార్టీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), సిద్దాటపు వెంకటరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, అబ్దుల్లా, జంషీర్, గండికోట రమేష్ పాల్గొన్నారు.

జగన్నాటకం

» తెరపైకి వైవీ, జంకె పేర్లు

» ఇచ్చిన హామీ గురించి తేల్చాలని ఓ ఎమ్మెల్యే అధిష్ఠానంకు సమాచారం

» ఆయనతో ఐప్యాక్ ప్రతినిధుల సుదీర్ఘ భేటీ

వైసీపీ అభ్యర్థుల ఎంపికపై తుది దశలో పడిన పీటముడి సరికొత్త పంథాలోకి మారే అవకాశం కనిపిస్తోంది. ఎంపీ మాగుంటకు కొత్త షరతులు విధించి దూరంగా పెట్టిన సీఎం జగన్.. తన బాబాయి అయిన మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని రంగంలోకి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఆ వ్యూహంతోనే మాగుంట, బాలినేని మైత్రిని దెబ్బకొట్టేందుకు సరికొత్త వ్యూహానికి తెరతీశారు. బాలినేనికి అవసరమైతే గిద్దలూరు స్థానాన్ని కేటాయిస్తామని, రెండుస్థానాల్లో మీరు సూచించిన అభ్యర్థులకు అవకాశం ఇస్తామని ఆశ పెట్టినట్లు కూడా తెలుస్తోంది. తాజాగా మార్కాపురం నుంచి ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేరు తెరపైకి రావడం అందుకు ఉదాహరణగా చెబుతున్నారు. అదేసమయంలో ఉమ్మడి జిల్లాలోని ఓ సీనియర్ ఎమ్మెల్యేతో శనివారం ఐప్యాక్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఎన్నికలకు అవసరమైన ఆర్థిక సహకారం ఇస్తామని తనకు పార్టీలోని కొందరు పెద్దలు చెప్పారని, ముందు ఆ విషయంలో వారి వైఖరేమిటో తెలుసుకుని రావాలని ఆయన సూటిగా చెప్పినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసీపీ అభ్యర్థుల జాబితా ఖరారు సోమ, మంగళ వారాలకు వాయిదా పడింది. సీఎం జగన్ వ్యూహాత్మకంగానే ఈ ప్రక్రియను వాయిదా వేసినట్లు భావిస్తున్నారు. తద్వారా లోక్‌సభ అభ్యర్థి విషయంలో తన ఆలోచనను తెరపైకి తేవడంతోపాటు మాగుంట, బాలినేనిల మధ్య సఖ్యతను దెబ్బతీయాలని కూడా యోచిస్తున్నట్లు భావిస్తున్నారు. గత కొద్దినెలలుగా ఒంగోలు ఎమ్మెల్యే అయిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి.. ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు అసెంబ్లీకి తాను పోటీచేస్తున్నట్లు ప్రకటిస్తున్న విషయం విదితమే. ఒంగోలుతోపాటు జిల్లాలోని ఆయాప్రాంతాల్లో జరిగిన సభల్లో కూడా ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అయితే రెండురోజుల క్రితం ఆయన విజయసాయితోపాటు వెళ్లి సీఎంను కలిసినప్పుడు మాగుంట విషయాన్ని పక్కనపెట్టాలని జగన్ సూటిగా చెప్పారు. తాను విధించిన షరతులకు మాగుంట నుంచి సానుకూల స్పందన రాలేదన్న విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించి ఆయన విషయాన్ని వదిలేయాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆ మరుదినమే విజయసాయిరెడ్డితో జగన్ సరికొత్త ప్రతిపాదనను తెలిపారు.

గత ఎన్నికల్లో వైసీపీకి భారీ ఆధిక్యం వచ్చిన గిద్దలూరు నుంచి బాలినేని పోటీచేసినా తనకు అభ్యంతరం లేదని, అయితే ఒంగోలులో దీటైన అభ్యర్థిని బరిలో నిలిపి గెలిపించాల్సిన బాధ్యత ఆయనదేనని కూడా చెప్పారు. అలాగే పశ్చిమప్రాంతంలో ఒకట్రెండు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల విషయంలో బాలినేని ప్రతిపాదనకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించినట్లు తెలిసింది. తదనుగుణంగానే జిల్లాలో అభ్యర్థుల ఎంపికను పూర్తిచేయకుండా వాయిదా వేశారు.

ఇరకాటంలో బాలినేని

జగన్ ప్రతిపాదన సహజంగానే బాలినేనికి ఇబ్బందికరంగా మారింది. 'గతంలో జగన్‌పై ఉన్న నమ్మకంతోనే నేను మాగుంట విషయాన్ని బహిరంగంగా ప్రకటించాను. ఇప్పుడు ఆయన్ను ఒంటరిగా వదిలేయడం మంచిదికాదు. ఆయనకు మద్దతుగా నిలవక తప్పదు' అని బాలినేని తన అనుచరులతో అన్నట్లు తెలిసింది. తనకు ఒకట్రెండు నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యం ఇచ్చినా మాగుంట విషయంలో వెనక్కు తగ్గడం తగదన్న భావనతో ఆయన ఉన్నారు. దీంతో మాగుంటకు అవకాశం ఇవ్వాల్సిందేనని విజయసాయి ద్వారా సమాచారం పంపారు. తాడేపల్లి వెళ్లి విజయసాయిని కలిసి సీఎం జగన్‌ను కలవకుండా వెనక్కు వెళ్లిన మాగుంట ప్రస్తుతం బాలినేనితో టచ్‌లోనే ఉన్నట్లు తెలిసింది. మాగుంటను పక్కనపెట్టి తిరిగి ఒంగోలు లోక్‌సభకు వైవీ అభ్యర్థిత్వాన్ని తెరపైకి తెస్తే సహజంగానే బాలినేని దానిని జీర్ణించుకోలేరు. దీంతో అధిష్ఠానం తాజా వ్యూహాన్ని ఎలా ఎదుర్కోవాలన్న విషయమై అనుచరులతో బాలినేని మంతనాలు జరుపుతున్నారు. తదనుగుణంగానే ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి మాగుంటకు, అసెంబ్లీకి తనకు అవకాశం ఇవ్వాలన్న సమాచారం పంపినట్లు తెలుస్తోంది. పైగా బాలినేని గిద్దలూరు వెళ్లినా ఒంగోలు అభ్యర్థి ఎంపిక విషయంలో సమస్యలున్నట్లు తెలిసింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దర్శి మినహా ఇతరప్రాంతాల్లో పోటీచేయనని ఇప్పటికే తేల్చి చెప్పారు. అయితే గత ఎన్నికల్లో సిటింగ్ ఎంపీగా ఉన్న వైవీని తప్పించిన జగన్ అప్పుడిచ్చిన హామీమేరకు వైవీని ఇప్పుడు మళ్లీ రంగంలోకి తెస్తారా? బాలినేని అందుకు సహకరిస్తారా? బాలినేని, మాగుంట బంధం తెగుతుందా లేక సరికొత్త పంథాలో కలిసి అడుగేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

మార్కాపురానికి పరిశీలనలో జంకె పేరు

మార్కాపురం నియోజకవర్గం నుంచి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేరును ఆపార్టీ అధిష్ఠానం సీరియస్‌గానే పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆర్థికంగా ఇబ్బందులున్న అంశాన్ని పక్కన పెడితే మిగిలిన విషయాల్లో ఆయన్ను తీసిపారేయలేమని ఐప్యాక్ ప్రతినిధులు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. పైపెచ్చు తనను పూర్తిగా పక్కనపెడితే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీచేయాలన్న ఆలోచన జంకె చేస్తున్నట్లు తెలిసింది. 1994లో అలా టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన జంకె.. కుదిరితే అప్పట్లా అవకాశం వస్తుంది, కాకపోయినా తనకు పోయేదేముంది అన్న భావనతో ఉన్నట్లు ఆయన అనుచరులు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జంకె పేరును అధిష్ఠానం తిరిగి పరిశీలిస్తుండటం చర్చనీయాంశమైంది.

సీనియర్ ఎమ్మెల్యేతో ఐప్యాక్ ప్రతినిధుల భేటీ

ఉమ్మడి జిల్లాలోని దక్షిణ ప్రాంతానికి చెందిన ఒక సీనియర్ ఎమ్మెల్యేతో ఐప్యాక్ ప్రతినిధులు శనివారం భేటీ అయినట్లు తెలిసింది. వారు కొన్ని అంశాలపై ఎమ్మెల్యేను సూటిగా ప్రశ్నించగా ఆయన నిర్మొహమాటంగా పలు విషయాలను వారి దృష్టికి తెచ్చినట్లు తెలుస్తోంది. శనివారం సాయంత్రం ఆ ఎమ్మెల్యే అనుచరులే ఐప్యాక్ ప్రతినిధులు భేటీ అయినట్లు సదరు ఎమ్మెల్యే చెప్పిన అంశాలను బహిరంగంగా ప్రస్తావిస్తున్నారు. 'నాకు పార్టీ మారే ఉద్దేశం లేదు. అవసరమూ లేదు. నాకు వారసులు లేరు. ఆపై ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆశ కూడా లేదు. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ విషయాన్ని ముఖ్య నాయకులు ప్రస్తావించినప్పుడు ఆర్థిక సహకారం అవసరమని చెప్పా. డబ్బు రాజకీయాలు వచ్చినందున ప్రత్యర్థుల కన్నా మనం ఎక్కువ ఖర్చు చేయకపోతే ఉపయోగం లేదు. నా దగ్గర డబ్బులు లేవన్న విషయాన్ని అధిష్ఠానంలోని ముఖ్య నాయకులకు ఇప్పటికే చెప్పా' అని ఐప్యాక్ ప్రతినిధులకు గుర్తుచేసినట్లు తెలిసింది. అప్పుడు హామీ ఇచ్చిన ఇద్దరు నాయకులు దాని అమలు దిశగా అడుగులు వేయలేదని, ముందు ఆ విషయాన్ని తేల్చుకుని రావాలని ఐప్యాక్ ప్రతినిధులకు ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఇంకోవైపు శనివారం జిల్లా మొత్తంగా ఐప్యాక్ ప్రతినిధులు వైసీపీ ఇన్‌చార్జిలు, ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్య నాయకులపై నిఘా పెట్టారు. ఇతర పార్టీలకు టచ్‌లో ఉన్నారా? లేక వెన్నుపోటు వ్యవహారాలకు సిద్ధమవుతున్నారా? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఒక నాయకుడైతే మీరు చేసింది చాలు, నిఘాలు పెట్టి మమ్మల్ని ఏమి చేయగలరంటూ తన ఇంటివద్దకు వచ్చిన ఐప్యాక్ ప్రతినిధులను కసురుకుని పంపినట్లు సమాచారం.

హ్యాపీ... న్యూఇయర్
2024కి ఘన స్వాగతం


నెల్లూరు : ఆదివారం అర్ధరాత్రి తర్వాత నగరంలో యువకుల ఉత్సాహం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 : ఆదివారం అర్ధరాత్రి గడియారంలో ముల్లు 12 గంటలను తాకిన వెంటనే హ్యాపీ... న్యూఇయర్ అంటూ జిల్లా అంతటా మారుమోగింది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చిన్నా, పెద్ద, యువత కేరింతలు కొట్టారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని సంబరాలు జరుపుకున్నారు. 2023 సంవత్సరానికి వీడ్కోలు చెప్పి 2024 సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం పలికారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వ్యాపార కేంద్రాలు, కార్యాలయాలు, చర్చిలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. నూతన సంవత్సరం రాక సందర్భంగా వస్త్రాలు, ఆభరణాలు, వాహనాలు, గృహోపకరణాల వ్యాపారం కళకళలాడింది. స్వీట్లు, కేకుల దుకాణాలు కిటకిటలాడాయి. ఇక, నాయకులు, అధికారులకు, ఆప్తులకు శుభాకాంక్షలు తెలిపే వారి కోసం ప్రత్యేకంగా బొకేలు తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. కొనుగోలుదారులతో నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు కళకళలాడాయి. మందు విందుతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలకాలనుకునే మందుబాబులు హోటళ్లు, బార్లు, గెస్టుహౌస్‌లు, గార్డెన్లలో సంబరాల్లో మునిగారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

● రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హరి నారాయణన్, జేసీ కూర్మనాథ్, టీడీపీ నేతలు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు.

తాగండి... ఊగండి !

మద్యం దుకాణాలు, బార్ల వేళల పెంపు

నెల్లూరు(క్రైం) : మద్య నిషేధం హామీని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం పండుగలు, ప్రత్యేకమైన రోజుల్లో ఆదాయమే పరమావధిగా అదనంగా మద్యం అమ్మకాలకు అనుమతిస్తోంది. తాగండి.. ఊగండి అన్నట్లు ప్రజలను మత్తువైపు ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో నూతన సంవత్సరం రాక సందర్భంగా ఆది, సోమవారాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు సాగిస్తోంది. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో రాత్రి 12 గంటల వరకు, బార్లలో రాత్రి 1 గంట వరకు అమ్మకాలు చేసేలా ఆదేశాలిచ్చింది. దీంతో అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు, బార్లు మందుబాబులతో నిండి, పూటుగా మందు తాగి ఆ మత్తులో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

నాగారపమ్మకు పూజలు

సంగం, డిసెంబరు 31: మండలంలోని కోలగట్లలో నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

కలువాయిలో హిందూ సమ్మేళనం



అక్షితలు తీసుకుని ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కలువాయి, డిసెంబరు 31 : కలువాయి హిందూ ధర్మ పరిరక్షణ సమితి, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షితలు, కరపత్రాలతో స్థానిక కలువాయమ్మ ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా సాయిబాబా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారికి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, సమితి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజలకు అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే మేకపాటి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయగిరిలోని తన అతిథిగృహంలో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గం లోని టీడీపీ నాయకులు, తన అభిమానులు, ప్రజలతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటామని ఎమ్మెల్యే మేకపాటి తెలిపారు.

నందిపాడులో వైద్యశిబిరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 31: మండలంలోని నందిపాడులో ఆదివారం నియోజకవర్గ టీడీపీ నాయకుడు, కాకర్ల ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఆరోగ్య సంజీవని రథం ద్వారా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 175 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మండల శ్రీనివాసులనాయుడు, పోతుగుంట వెంకటేశ్వర్లు, నల్లబోతుల వెంకటేశ్వర్లు, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐవైఎం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సీఐ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: స్థానిక సీఐ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 'మరలిరాదు ఈ జీవితం' అనే నినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్లను కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు ఆవిష్కరించారు. ఎస్ఐలు ఉమాశంకర్, అనూష, సంస్థ జిల్లా అధ్యక్షుడు ఇందాదుల్లా, ఎస్ఐవో జిల్లా అధ్యక్షుడు అజరుల్లా, సభ్యులు ఇమ్రాన్, తాహిల్, తారీక్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మున్సిపల్, అంగన్‌వాడీల సమ్మె ఉధృతం



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



దున్నపోతుకు వినతిపత్రం అందచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు, డిసెంబరు 31: ఆత్మకూరు పట్టణంలో సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఆందోళనలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ ఆందోళనకు ఆదివారం నుంచి ఏఐటీయుసీ మద్దతు తెలుపుతూ మిగిలిన మున్సిపల్ కార్మికులు మద్దతు తెలపడంతో సమ్మె ఉధృతమైంది. సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దున్నపోతుకు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అదేవిధంగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. అదేవిధంగా ఇప్పటి వరకు సమ్మెలోకి రాని ఏఐటీయుసీ అనుబంధ సంఘాల మున్సిపల్ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, ఏఐటీయుసీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అవినీతిని ఎత్తిచూపితే అక్రమ కేసులా? : సోమిరెడ్డి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: ఉదయగిరిలో పేదల ఇళ్లకు ఉపయోగించాల్సిన సిమెంట్‌ను హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి తన సొంత భవన నిర్మాణానికి ఉపయోగిస్తూ అవినీతికి పాల్పడడాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటే వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై దాడిచేసి వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ వైసీపీ నేతలతో కలిసి టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. అవినీతికి పాల్పడిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి సంబంధంలేని వారితో అట్రాసిటీ కేసు పెట్టించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టీడీపీ నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నటి వెంకటరెడ్డి, ముజ్జే లక్ష్మీనారాయణ, బాబులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయడంతోపాటు పేదల సిమెంట్ అక్రమంగా వినియోగించుకుంటున్న వ్యక్తిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



బస్టాండ్ సెంటర్‌లో విచారణ చేస్తున్న డీఎస్పీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును ఆదివారం కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండ్ సెంటర్‌లో ఘర్షణ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అలాగే సెంటర్‌లో దుకాణాల యజమానులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం స్థానిక సర్కిల్ కార్యాలయానికి చేరుకొని ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్ఐలు ఉమాశంకర్, అనూష, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బొల్లినేని



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొల్లినేని

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: కేంద్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి నారాయణరాణేను ఆదివారం ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లి నేని వెంకట రామారావు తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన మంత్రి దంపతులను బొల్లినేని తన స్వగృహానికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు చొరవ చూపి వలసల నివారణ చర్యలు చేపట్టాలని బొల్లినేని మంత్రిని కోరారు. అలాగే ప్రస్తుత రాజకీయాలపై వారిరువురు గంటపాటు చర్చించుకున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పరిహారం కోసం రైతుల ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: సీతారామపురం-దుత్తలూరు మీదుగా ఏర్పాటు చేస్తున్న 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని శకునాలపల్లి పంచాయతీ రైతులు యర్రబల్లిగడ్డ సెంటర్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళ మెడలో సరుడు అపహరణ

వరికుంటపాడు, డిసెంబరు 31: పొలంలో గడ్డి కోస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు సరుడును గుర్తు తెలియని దుండగుడు అపహరించిన సంఘటన ఆదివారం వరికుంటపాడులో చోటుచేసుకుంది. వివరాల మేరకు... ఆండ్రావారిపల్లి గ్రామానికి చెందిన మద్దిరెడ్డి సీతారావమ్మ పశువుల మేత కోసం స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో పొలానికి వెళ్లింది. దీంతో ఒంటరిగా గడ్డి కోస్తున్న ఆమెను గమనించిన దుండగుడు మెడలోని బంగారు సరుడును లాక్కొని పరారయ్యాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుమన్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పేదలకు దుస్తుల పంపిణీ

వరికుంటపాడు, డిసెంబరు 31: నూతన సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎస్టీ కాలనీలో ఆదివారం సామ్యూల్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తాతపూడి. కళావతి, ఆకాష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువులకు టీకాలు

వరికుంటపాడు, డిసెంబరు 31: మండలంలో మంగళవారం నుంచి 30వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి ఎస్‌వీ రాఘవేంద్రశర్మ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జనవరి 2వ తేదీన తూర్పు బోయమడగల, వేంపాడు, పెద్దిరెడ్డిపల్లి, 5న గువ్వాడి, 7న భాస్కరాపురం, 8న వరికుంటపాడు, 9న నారసింహాపురం, 10న రామాపురం, 12న ఇస్కపల్లి, తొడుగుపల్లి, 14న అలివేలుమంగాపురం, 15న ఎన్‌బీపల్లి, మహమ్మదాపురం, 16న కాంచెరువు, 18న దామంచర్ల, తోటలచెరువుపల్లి, 20న తూర్పుచెన్నంపల్లి, గణేశ్వరాపురం, 21న గొల్లపల్లి, 22న జడదేవి, 23న పామూరుపల్లి, 24న దక్కనూరు, 25న కనియంపాడు, తూర్పుపాళెం, 26న కొండాయపాళెం, 27న ఇస్కపల్లి, రామదేవులపాడు, 29న జీ.కొండారెడ్డిపల్లి, 30న అలివేలుమంగాపురం గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: మండలంలోని గండిపాళెం ఏపీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో పీజీటీ జీవశాస్త్రం, ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు 3వ తేదీ లోపు దరఖాస్తు దాఖలు చేయాలన్నారు. ఈ పోస్టుకు పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ, టెట్ అభ్యర్థులు అర్హులన్నారు.

3 నుంచి ఏఐటీయూసీ కార్మికుల సమ్మె

కావలి, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారంలో భాగంగా ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులు కూడా ఈనెల 3వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఎండ్లూరి రవి, కొప్పర్తి నాగరాజు, ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేశ్, బండారు రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిసెంబరు 7న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మె చేపడుతామని ప్రభుత్వానికి నోటీస్ ఇవ్వగా 10 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటికీ పరిష్కరించకపోవడంతో సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు.

యూరియా కొరత సృష్టిస్తే డీలర్లపై చర్యలు

అల్లూరు, డిసెంబరు 31 : ప్రైవేటు డీలర్లు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అల్లూరు వ్యవసాయాధికారి లలిత హెచ్చరించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అల్లూరులో యూరియా కొరత' కథనంపై ఆమె స్పందించారు. ఆమె మాట్లాడుతూ ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా కొనాల్సిన అవసరం లేదని, ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆర్బీకేల ద్వారా ఎరువులను పొందేందుకు అవకాశం ఉందన్నారు. సొసైటీల్లో యూరియా నిల్వలు ఉంచేందుకు అభ్యర్థనలు పంపి ఉన్నామన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

కావలిటౌన్, డిసెంబరు 31: కావలి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీ, రాఘవేంద్ర కాలనీ, సాయిబాబా నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు పేరం వెంకటేశ్వర్లు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, గంధం ప్రసన్న, రాజకుమార్, స్థానిక నేతలు పూనూరు శివకుమార్ రెడ్డి, అందె కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



రామాంజనేయులు

కందుకూరు : స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న డీ.రామాంజనేయులుకు అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించిం ది. క్విట్ ఇండియా ఉద్యమం యొక్క చారిత్రక అధ్య యనం - నూతన దృక్పథంతో పరిశీలన అనే అంశంపై ప్రొఫెసర్ కె.మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో రామాంజ నేయులు పరిశోధనాపత్రాలు సమర్పించడంతో డాక్టరేట్ లభించిందని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవి కుమార్ తెలిపారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు రామాంజనేయులును ప్రిన్సిపాల్ రవికుమార్, సహచర అధ్యాపకులు అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్ : కావలి మండలం రాజువారి చింతలపాలెం సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై ఆదివారం రూరల్ ఎస్ఐ సుమన్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,29,400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

సంగం : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతిచెందిన సంఘటన మండలంలోని జంగాలదొరువులో శనివారం అర్థరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కలిగిరి మండలం చిన్న అన్నలూరుకు చెందిన సీహెచ్ పద్మావతి (25)కి ఐదేళ్ల కిందట జంగాలదొరువు గ్రామానికి చెందిన వెంకటరత్నంతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అర్థరాత్రి భర్త వెంకటరత్నం నిద్రలేచి చూసేటప్పటికి మంచంపై అపస్మారక స్థితిలో పద్మావతి పడిఉండడంతో ఉదయం వెంకటరత్నం పద్మావతి తల్లికి ఫోన్‌చేసి సమాచారం అందించాడు. దీంతో ఆమె సంఘటన స్థలానికి వచ్చి అల్లుడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

మహోన్నత లక్ష్యంతో ముందడుగు

ఉదయగిరి నియోజకవర్గ మెట్టప్రాంతంలో సమయానికి వర్షాలు కురవక నష్టాలు చవిచూసే రైతులు... కనీసం కూలిపనులు లేక ఊళ్లకి ఊళ్లే వలసలు వెళ్లే పరిస్థితులు... సమయానికి వైద్యం అందక మృత్యువాతపడే అభాగ్యులు... ఉపాధిలేక అల్లాడే యువతీ యువకులు... చిన్నపాటి వ్యాపారాలకీ ఆర్థిక ఇబ్బందులుపడే చిరు వ్యాపారులు... ఇలా కన్నీరెట్టించే బాధలు ఎన్ఆర్ఐ కాకార్ల సురేశ్‌ని కలిచి వేశాయి. సొంత ప్రాంతానికి ఏదో చేయాలనే తపనతో విదేశాలని వదిలి ఉదయగిరిలో అడుగుపెట్టేలా చేశాయి. తన వంతుగా తమ ప్రాంత ప్రజలకి మరిచిపోలేని మేలు చేయాలని, అందర్నీ ఉన్నతమార్గంలో నడిపించాలనే మహోన్నత లక్ష్యంతో ముందడుగు వేశారు. కాకార్ల చారిటబుల్ ట్రస్టుని స్థాపించి విద్యా, వైద్యం, ఉపాధితో పాటు పలు విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వం చాటుకుంటు న్నారాయన. పూర్తి వివరాలపై ఆంధ్రజ్యోతి కథనమిది.



ఉదయగిరి నియోజకవర్గ మెట్టప్రాంతంలో సమయానికి వర్షాలు కురవక నష్టాలు చవిచూసే రైతులు... కనీసం కూలిపనులు లేక ఊళ్లకి ఊళ్లే వలసలు వెళ్లే పరిస్థితులు... సమయానికి వైద్యం అందక మృత్యువాతపడే అభాగ్యులు... ఉపాధిలేక అల్లాడే యువతీయువకులు... చిన్నపాటి వ్యాపారాలకీ ఆర్థిక ఇబ్బందులుపడే చిరు వ్యాపారులు... ఇలా కన్నీరెట్టించే బాధలు ఎన్ఆర్ఐ కాకార్ల సురేశ్‌ని కలిచివేశాయి. సొంత ప్రాంతానికి ఏదో చేయాలనే తపనతో విదేశాలని వదిలి ఉదయగిరిలో అడుగుపెట్టేలా చేశాయి. తన వంతుగా తమ ప్రాంత ప్రజలకి మరిచిపోలేని మేలు చేయాలని, అందర్నీ ఉన్నతమార్గంలో నడిపించాలనే మహోన్నత లక్ష్యంతో ముందడుగు వేశారు. కాకార్ల చారిటబుల్ ట్రస్టుని స్థాపించి విద్యా, వైద్యం, ఉపాధితో పాటు పలు విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వం చాటుకుంటున్నారాయన. పూర్తి వివరాలపై ఆంధ్రజ్యోతి కథనమిది.

- మానవత్వం చాటుతున్న ఎన్ఆర్ఐ
- ఉదయగిరిలో విస్తృత సేవలు
- విద్యా, వైద్యం, ఉపాధికి అధిక ప్రాధాన్యత
- అన్నా క్యాంటీన్ ద్వారా రుచికరమైన భోజనం
- అభాగ్యులకి ఆర్థికంగా అండదండలు



సామాన్య కుటుంబం

ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం ఎర్రంరెడ్డిపల్లిలో కాకర్ల సురేశ్ జన్మించారు. కాకర్ల వెంకటసుబ్బానాయుడు, ప్రమీల తల్లిదండ్రులు. తండ్రి వెంకట సుబ్బానాయుడు రెవెన్యూశాఖలో వీడీఓగా పనిచేసేవారు. ఉదయగిరితో పాటు పలుప్రాంతాల్లో ఆయన సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. చిన్నప్పటి నుంచి సురేశ్, సోదరుడు సునీల్ కష్టపడి చదువుకునేవారు. సురేశ్ చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పొణికి పుచ్చుకున్నారు. హైస్కూల్ లో చదివే రోజుల్లోనే విద్యార్థి సంఘంలో చురుగ్గా ఉండేవారు. విద్యార్థుల సమస్యలపై జరిగే పోరాటాల్లో కీలకభూమిక పోషించేవారు. సురేశ్ ఇంజనీరింగ్, సునీల్ పశువైద్యంలో ఉన్నత చదువులు అభ్యసించారు. చదువుల్లో ఉన్నతంగా రాణిస్తూ తల్లిదండ్రులకి పేరు తెచ్చారు.



సేవలోనే ఆనందం

అన్నదమ్ములు ఇద్దరూ 2000 సంవత్సరంలో అమెరికాకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అమెరికా దేశానికి వెళ్లి జీవితం హాయిగా గడిచిపోతున్నా, సురేశ్‌లో ఏదో వెలితి అనిపించేది. కేవలం మనం, మన కుటుంబమే కాదు... మన తెలుగువారికి, తోటివారికి సాయం చేయాలని తపనపడేవారు. అలా నార్త్ కెరిలినా తెలుగు అసోసియేషన్‌కి పదేహేనేళ్లపాటు అధ్యక్షుడిగా పనిచేశారు. తానా రీజనల్ ఉపాధ్యక్షుడిగానూ పనిచేసి ప్రముఖుల ప్రశంశలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడే విద్యార్థులు, అకస్మాత్తుగా అనారోగ్యా నికి గురై, భీమాలు వంటివి లేక ఇబ్బందులు పడేవారికి సంస్థల ద్వారా వెన్నుదన్నుగా నిలిచేవారు. అకస్మాత్తుగా కొందరు అమెరికాలో మృతిచెందగా, ఇండియాలో వారి కుటుంబాలు కడచూపు కోసం వేడుకుంటూ ఉండేవారు. అలాంటి సందర్భాల్లో, వారి పార్థీవదేహాలని స్వస్థలాలకి పంపించేందుకు రోజులు తరపడి పనిచేసేవారు. ఇలా సురేశ్ ఎన్నెన్నో సేవలు చేస్తుండేవారు. అలా అమెరికాలో ఉన్నన్ని రోజులు తోటి వారికి సేవచేస్తూ ఆనందించేవారు.

కోవిడ్ సమయంలో...

ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి గజగజ వణికిస్తూ అందరూ ఇళ్లకే పరిమితమైనప్పుడు సురేశ్ నిరుపమైన సేవలకి శ్రీకారం చుట్టారు. తానా సంస్థలోని టీం స్క్వేర్ టీంకి కో-చైర్మన్‌గా మిగిలిన సభ్యులతో కలిసి సంపూర్ణ బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో రూ.4కోట్లతో ఆక్సిజన్ వెంటిలేటర్లు ఏర్పాటు చేయించారు. తద్వారా తానా టీమ్ స్క్వేర్ ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడగలిగారు. అలాగే 15వేల మెడికల్ కిట్లు అందించారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచమంతటా జడలు విప్పి కరతాళనృత్యం చేస్తున్న సమయంలో సురేశ్ తనవంతుగా తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం క్రియాశీలక పాత్ర పోషించారు. ఏపీ గవర్నర్ చేతుల మీదుగా తానా టీం స్క్వేర్ తరుపున అవార్డుని అందుకున్నారు.



కరిగించిన కన్నీటి కష్టాలు..

ఉదయగిరి నియోజకవర్గ ప్రజల కన్నీటి కష్టాలని చూసి కాకర్ల సురేశ్ చలించిపోయారు. తాను ఏదోలా తనవాళ్లకి సాయపడాలని నిర్ణయించుకున్నారు. ఆరు నెలల పాటు ప్రజల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, అవసరాలు, సమస్యలపై సర్వే చేయించారు. నియోజకవర్గంలోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లోని మారుమూల కుగ్రామాల్లో పరిస్థితులనీ అంచనా వేశారు. 2021 అక్టోబర్‌లో కాకర్ల చారిటబుల్ ట్రస్టుని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ట్రస్టు తరుపున రూ.కోట్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విస్తృత సేవా కార్యక్రమాలివే



• వింజమూరులో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి 250 రోజులకి పైగా ప్రతిరోజూ సరాసరిన 600 మందికి రూ.5లుకే రుచికరమైన భోజనం అందిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఎంతో మంది ఆకలితో ఇబ్బంది పడే పేద, నిరుపేదల ఆకలి తీరుస్తున్నారు. వింజమూరుకి పలు పనుల మీద వచ్చే రైతులు, చిరుద్యోగులు వంటివి వారూ భోజనం చేసి తృప్తిగా వెళుతున్నారు. • ప్రకాశం జిల్లా మార్కాపురంలో సంజీవనీ ఆరోగ్య రథాన్ని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రారంభించారు. అప్పటి నుంచి ఉదయగిరి నియోజవర్గంలోని గ్రామగ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఉచితంగా అత్యాధునిక పరీక్షలు నిర్వహించి, మేలురకం మందులు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 26000 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. • గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి పరీక్షలు నిర్వహించారు. 50 మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు. 1150 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. • వింజమూరులో ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 400 మందికి ఆయా రంగాల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించి సర్టిఫికేట్లు అందజేశారు. పరిశ్రమలు, సంస్థలతో సంప్రదించి వందలాది మందికి ఉపాధి కల్పించారు. మరికొందరు వారి గ్రామాల్లోనే ఇంటి వద్ద స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ సామాగ్రి కోసం ఆర్థిక సహాయం అందించారు. • డ్రైవింగ్ శిక్షణ సంస్థ ద్వార యువకులకి డ్రైవింగ్ లో శిక్షణ ఇప్పించడంతో పాటు లైసెన్సులూ ఇప్పించారు. 30 మందికి పైగా డ్రైవింగ్ ద్వారా ఉపాధిపొందే వీలు కల్పించారు. • గ్రామాల్లో సమస్యలన్నీ గుర్తించి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో రూ.50వేలు నుంచి రూజ2లక్షలు ఖర్చు పెడుతూ 20కి పైగా పంచాయతీల్లో రోడ్ల మరమ్మతులు, బోర్లు నిర్మాణం వంటివి చేపట్టారు. • వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో రైతులకి పవర్ స్ప్రేయర్లు దొరక్క ఇబ్బంది పడుతుంటారు. దాంతో 160కి పైగా పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో రైతులు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. వాటికి అవసరమైన మరమ్మతులూ చేయిస్తున్నారు. • 80 మందికి పైగా చిరువ్యాపారులకి తోపుడు బండ్లు ఇప్పించి, వారి ఇళ్ల వద్దకే చేర్చారు. అగ్ని ప్రమాదాలు, విపత్తుల వల్ల పూర్తిగా నష్టపోయిన 35 కుటుంబాలని ఆర్థికంగా ఆదుకున్నారు. 35 కుటుంబాలకి రూ.50వేలు నంచి రూ.2లక్షల వరకు ఆర్థికంగా సహాయం చేశారు. అనారోగ్యం వల్ల ఆర్థికంగా చితికిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న 2200 మందికి, వారి పరిస్థితులని బట్టి రూ.5వేలు నుంచి రూ.2లక్షల వరకు సాయం అందించారు. • పేదల ఇళ్లలో జరిగే వివాహాలకి హాజరై 550 కుటుంబాలకి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున పెళ్లి కానుకగా అందజేశారు. • 30కి పైగా ప్రాంతాల్లో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్లు నిర్వహించి క్రీడాకారులని పోత్సహిస్తున్నారు.

చంద్రబాబుకి వీరాభిమాని :

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడికి సురేశ్ వీరాభిమాని. చిన్నప్పటి నుంచి ఆయన్నే ఆదర్శంగా తీసుకుని ముందుకు నడిచామని చెబుతారు. కష్టపడి చదువుకోవడం, ఉన్నత శిఖరాలు అధిరో హించడం ఒక ఎత్తు అయితే... సేవా కార్యక మాలు చేపట్టి సమాజానికి మనవంతు సేవ చేయడం మరో ఎత్తని, అందులోనే తనకి అమిత ఆనందం లభించిందని అంటారు. యువనేత లోకేశ్ సిద్ధాంతాలు, వ్యక్తిత్వం తనపై ఎంతో ప్రభావం చూపాయని చెబుతారు. ఎవరికైనా సాయం చేసినప్పుడు నూరేళ్లు చల్లంగా ఉండయ్యా... అంటూ దీవించే దీవనలు ఇచ్చే ఆత్మసంతృప్తి మరువలేనిదని అంటుంటారు. జీవితాంతం తన వంతు ప్రజలకి సేవ చేస్తూనే ఉంటానని చెబుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

జగన్ దృష్టిలో ముస్లింలు ఓటు బ్యాంకు మాత్రమే

- ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 31: తెలుగుదేశం ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీల కోసం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి నిరుపేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునివ్వగా, జగన్ అధికారం చేపట్టగానే వాటన్నింటినీ నిలిపివేసి ముస్లింలను దగా చేశాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. జగన్ ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తున్నాడనే విషయాన్ని గ్రహించాలని పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డు ఉర్దూ స్కూల్ వద్ద ఆదివారం నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలోనే నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధి జరిగిందన్నది అక్షర సత్యమని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఈ సందర్భంగా షేక్ హాజీబాషా, షేక్ హాజహాన్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నగర జయకృష్ణ, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, ఈదర రమణమ్మ, జియావుద్దీన్, ఫాజిల్, రావి జాలయ్య, చంటి, నాగరాజు, షేక్ రఫి, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఇంటూరి

ఎంపీపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

లింగసముద్రం : ప్రజలకు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

లింగసముద్రం, డిసెంబరు 31 : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నేత ఎం.మాకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో అధికారం, సొమ్ము ప్రజలదని, పాలనా సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని తెలిపారు. 2005లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ చట్టం అమలు జరపడం వలన పరిపాలనలో పారదర్శకత ఏర్పడి అవినీతిని నియంత్రించి ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు : కమిషనర్


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కావలి, డిసెంబరు 31: సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఆ ప్రభావంతో పట్టణంలో పారిశుధ్యం క్షీణించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పారిశుధ్య పనుల నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం డీఈ సాయిరాం, ఏఈ శ్రీనివాసులు రెడ్డితో కలిసి ఆలయ విలేకరులతో మాట్లాడారు. 90 మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో 40 మంది ప్రైవేట్ కార్మికులతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా పారిశుధ్య సమస్య ఉంటే సమాచారం ఇచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్ స్ప్రే చేస్తున్నట్లు చెప్పారు. చెత్తతో పేరుకుపోయిన డంపింగ్ యార్డులను కూడా క్లియర్ చేశామని వాటిలో పచ్చదనం పెంచి త్వరలో సుందరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. అమృత్ ప్రాజెక్ట్ పనులు 90 శాతం పూర్తి అయ్యాయని మిగిలిన 10 శాతం పనులు త్వరలో పూర్తి చేసేలా ఎమ్మెల్యేతో కలిసి చర్యలు చేపడుతున్నామన్నారు. పైపులైన్లకు ఇంటర్ కనెక్షన్‌లు ఇచ్చి త్వరలో పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా మంచి నీటి సరఫరా చేస్తామన్నారు. తుఫాన్‌కు దెబ్బతిన్న వీధిలైట్లు వెలిగేట్లు చర్యలు చేపడుతున్నామన్నారు. ట్రంకురోడ్డులో సెంటర్ లైటింగ్‌కు ఉన్న వివిధ కంపెనీల కేబుల్ వైర్లను పక్క స్తంభాలకు కట్టుకోవాలని చెప్పి డివైడర్‌లో ఉన్న సెంట్రల్ లైట్ స్తంభాలకు రోప్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీలో ఓపెన్ జిమ్ పరికరాలు ఉన్నాయని, వాటిని ముసునూరు మందాటి చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు. గడప గడపకు కార్యక్రమం ద్వారా ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.40 లక్షలతో రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు.

కళ్లకు గంతలు కట్టుకుని మున్సిపల్ కార్మికుల నిరసన


కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నడుస్తున్నకార్మికులు

కావలిటౌన్, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నడస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కరోనా కష్టకాలంలో ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహించారని, ప్రభుత్వ పెద్దలు కార్మికులకు ఇచ్చిన మాట, ముఖ్యమంత్రి ఎన్నికల హామీలు పూర్తిగా విస్మరించారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోగా అదనపు పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు తురకా శీనయ్య, బీ రమేష్, ఓ రమేష్, కృష్ణయ్య, అనిత, జ్యోతి పాల్గొన్నారు.

నవ్య

కుటుంబ కదంబం

నూతన సంవత్సర శుభాకాంక్షలు



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మేరు నగధీర రేఖ. సాధారణత్వం నుంచి గ్లామర్ శిఖరాగ్రం వరకు ఆమె ప్రయాణం అసాధారణం. రేఖ జీవిత చరిత్రను 'రేఖ- ది- అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో నవలీకరించాడు యాసిర్ ఉస్మాన్. దీన్ని 'స్వయంసిద్ధ- ఒక అభినేత్రి జీవనరేఖ' గా తెలుగులో అనుసృజన చేశారు శ్రీదేవీ మురళీధర్. ఆ పుస్తకంలోని కొన్ని విశేషాల సమాహారమే ఇది.!

ఇదొక అభినేత్రి జీవన'రేఖ'

తన తొలి చిత్రాలు విజయఢంకా మోగిస్తుంటే 1972లో రేఖ బొంబాయి జుహూ ప్రాంతంలో తన సొంత ఫ్లాట్ కొనుక్కుంది. పద్దెనిమిదేళ్ల రేఖ హోటల్ అజంతా నుండి జుహూ బీచ్ అపార్ట్‌మెంట్‌కు మారింది. అదే అపార్ట్‌మెంటులో నటి జయ భాదురి కూడా నివసించేది. రేఖ, జయ తమ సినిమా కెరీర్‌ను దాదాపు ఒకేసారి ప్రారంభించారు. అయితే నటులుగా వారిద్దరి ఎదుగుదల పూర్తి భిన్న పథాలలో నడిచింది. రేఖ నటిగా తనను తాను ఎన్నడూ సీరియస్‌గా తీసుకోలేదు. పరిశ్రమ కూడా ఆమెను సమర్థురాలైన నటిగా పరిగణించలేదు. ఆమె నటన గురించి కాకుండా ఆమె చుట్టూ గాలివార్తలు ఆమె వ్యక్తిగత జీవితం గురించి, ప్రచారం అవసరం లేని అనేకమైన విషయాల గురించి వెలుగులోకి వచ్చేవి. అది సునీల్‌దత్ వంటి సీనియర్ నటుడైనా, అప్పటి సూపర్ స్టార్ రాజేష్ ఖన్నా అయినా, రేఖ తన కోసం

> 'అతడు వివాహితుడు అన్న వాస్తవం వల్ల నా ఆలోచనలో ఎటువంటి తేడా లేదు. గలాబీ ఏ పేరుతో పిలిచినా గులాబీయే. అతడొక ఆసక్తికరమైన వ్యక్తిత్వం కల పురుషుడు, అంతే. నేను ఈ వ్యక్తితో అనుబంధం కలిగి ఉన్నాననే గౌరవాన్ని పొందాలనుకుంటున్నాను. కాబట్టి నన్ను ఆపగలిగేదేమిటి? నేను అతడి ఇంటిని, కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చెయ్యటం లేదు. కేవలం అతడిని చూసి, అతడి గాలి సోకి, ఆనందించగల మామూలు మనిషిగా ఉంటాను,' అని సిమి గరేవాల్ షోలో రేఖ చెప్పింది. సూపర్‌స్టార్ అమితాబ్ ఆకర్షణలో, ప్రేమలో రేఖ తలమునకలైంది. అయితే దీనిపై అమితాబ్ అధికారికంగా ఏనాడూ స్పందించలేదు.

ప్రతి ఒక్కరినీ సెట్స్ మీద వేచి ఉండేటట్లు చేసేది, మరి అది సాహసమో, వెర్రి ధైర్యమో! ఒకప్పుడు హృషీకేశ్ ముఖర్జీ వంటి గౌరవనీయుడైన దర్శకుడు కూడా 'నమక్ హరామ్' (1973) సెట్‌లో షూటింగ్ నిలిపివేయవలసి వచ్చింది. సగం రోజు పాటు అందరూ ఎదురు చూసినా రేఖ మాత్రం రాలేదు. ఆమె అప్పటికింకా యుక్త వయస్సు, స్వేచ్ఛా ప్రవృత్తి, భావోద్వేగం, త్వరగా చలించిపోయే సున్నితమైన మనసు కల స్టార్‌గా పేరు తెచ్చుకుంది.


అమితాబ్‌తో పరిచయం

బీచ్ అపార్ట్‌మెంట్స్‌లో, రేఖ, జయ తరచుగా కలుసుకునేవారు. రేఖ జయను ఆప్యాయంగా 'దీదీ భాయ్' అని పిలుస్తూ, ఆమెతో గడపడానికి జయ ఫ్లాట్‌కి వెళ్తూ ఉండేది. జయ రేఖకు జీవితం, వృత్తి గురించి సలహాలు ఇస్తూ ఉండేది. అక్కడే రేఖ జయ సన్నిహితుడు, స్నేహితుడైన అమితాబ్ బచ్చన్‌ను మొదటిసారి కలుసుకుంది.

జయ మీద కినుక...

నటుడు మెహమూద్ అధికారిక జీవిత చరిత్ర రచయిత హనీఫ్ ఝవేరి ఇలా అంటాడు. 'అమితాబ్, అన్వర్(మొహమూద్ సోదరుడు) సన్నిహితులు. అమితాబ్, జయలను తరచూ లాంగ్ డ్రైవ్‌లకు తీసుకెళ్లేవాడినని అన్వర్ నాతో చెప్పాడు. ఇద్దరూ అతనితో పాటు కారు, ముందు సీటులో కూర్చొని మాట్లాడుకునేవారు. వెనుక సీటులో రేఖ కూర్చునేది.' జయ, రేఖ ఒక రకంగా సినీ పరిశ్రమలో పోటీదారులు అయినప్పటికీ, జయ ఎంతో ప్రతిభావంతురాలిగా మంచి గౌరవం పొందింది. ఒక ఇంటర్వ్యూలో రేఖపై వ్యాఖ్యానించమని జయను అడిగితే.. రేఖ తనను తాను నటిగా సీరియస్‌గా తీసుకోలేదని జయ చెప్పింది. ఆ ఇంటర్వ్యూలో జయ మాటలు రేఖకు ఏమాత్రం నచ్చలేదని చెబుతారు.

అమితాబ్-జయ నటించిన 'జంజీర్' విజయం సాధించిన తర్వాత అమితాబ్, జయ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. 1973, జూన్ 3వ తేదీన, వారి వివాహం ఘనంగా జరిగింది. అయితే రేఖకు ఆహ్వానం అందకపోవటం ఆమెకు బాధ కలిగించింది. ఒక ఇంటర్వ్యూలో రేఖ మాట్లాడుతూ, 'ఒకప్పుడు నేను జయను సోదరిగా భావించాను. ఆమె ఆపేక్ష నిజమనుకున్నాను. ఎందుకంటే ఆమె చాలా గంభీరంగా, ప్రేమపూర్వకంగా నాకు సలహాలు



ఇచ్చేది. కానీ నాకొక్కదానికే కాదు, ఆమె అందరికీ సలహాలిస్తుందని ఇప్పుడు నేను తెలుసుకున్నాను. ఆమెకు కావలసింది మనుషుల మీద ఆధిపత్యం చలాయించటం మాత్రమే. అది కూడా తనకు అవసరమైనంత వరకే!' రేఖ అంతటితో ఆగలేదు. 'ఆమె పైపైన ఎంత ఆప్యాయత, స్నేహం చూపించినా, నేను తానుండే బిల్డింగ్‌లోనే ఉంటున్నా. తన పెళ్లికి మాత్రం నన్ను ఆహ్వానించలేదు' అంటూ జయ మీద కినుక వ్యక్తం చేసింది.

బచ్చన్ ప్రభావం

అందరిలాగే, రేఖ కూడా అమితాబ్ వ్యక్తిత్వాన్ని చూసి అప్రతిభురాలైంది. 2004లో సిమి గరేవాల్‌తో ఒక ప్రముఖ ఇంటర్వ్యూలో, 'మిస్టర్ అమితాబ్ బచ్చన్ ముందు నిలబడటం తేలికైన విషయం కాదు' అని, 'దో అంజానే'లో అమితాబ్ నాయకు

> 'నేను చేస్తున్న పనిని ఒక సరదాగా భావిస్తాను. అమ్మాయిలు కాలేజీ ఎగ్గొట్టినట్లు నేను షూటింగ్ ఎగ్గొడతాను. అయితే వాళ్ల కాలేజీలకు డబ్బు చెల్లిస్తారు. నా విషయంలో నిర్మాతలు నాకు డబ్బు చెల్లిస్తారు. ఎంత ధైర్యంగా కనిపించినా నా కోసం వెదికి, వేటాడే నిర్మాతలంటే నాకు ఎంతో భయం. స్నేహితుల దగ్గర దాక్కుని, మరునాడు సెట్స్‌లో అనారోగ్యంగా ఉన్నట్లు నటిస్తాను' అంటుంది రేఖ.

> సూటిగా, ధైర్యంగా, రహస్యాల, గోప్యతల ముసుగులు విడిచి రేఖ బాహాటంగా చేసే ప్రకటనలు కలకలం సృష్టించాయి. అయితే ఆమె మాటల్లో నిజానిజాలు నిర్ధారించటం సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో ఎవరికి తోచినట్లు వాళ్లు ఊహాగానాలు చేస్తూ, బచ్చన్ పరివారానికి సంఘంలో ఉన్న నిష్కళంకమైన పేరు ప్రతిష్ఠల మీద రేఖ దాడి మొదలు పెట్టినట్లు భావించారు.

డన్న విషయం తెలియగానే ఆమెకు మతిభ్రమించినంత పనైందని చెప్పింది. షూటింగ్ సమయంలో తనకెంతో భయంభయంగా ఉండేదని రేఖ గుర్తు చేసుకుంది. భయాందోళనలతో తాను చెప్పవలసిన డైలాగులు మరచిపోతుంటే అమితాబ్ బచ్చన్ ఒక రోజు తన మంద్రస్వరంలో గంభీరంగా ఆమెను మందలించాడని నవ్వుతూ చెప్పింది రేఖ.

ఇంకా ఆమె ఇలా చెప్పింది. 'అమితాబ్ లాంటి వాళ్లను నేను మునుపెన్నడూ చూసి ఉండలేదు. ఇన్ని మంచి లక్షణాలు ఒకే మనిషిలో ఎలా ఉండగలవు? నేను మూర్ఖురాలిని కాను, తెలివైనదానిననే అనుకుంటున్నాను. ఉత్తమత్వాన్ని చూసినప్పుడు గుర్తించగలను'. అమితాబ్ అంకితభావం, చిత్తశుద్ధి, వృత్తిపట్ల శ్రద్ధ రేఖ మనసును చూరగొని, మంత్రముగ్ధురాలిని చేశాయి. అతడు ఆమెపై చూపుతున్న ప్రభావం అందరికీ స్పష్టంగా కనిపించింది.

దీన్ని 'బచ్చన్ ఎఫెక్ట్' (బచ్చన్ ప్రభావం) అని పిలవచ్చేమో గాని రేఖ తన జీవితంలో ఎప్పుడూ చేయని పని ఇప్పుడు చేయటం ప్రారంభించింది. ఆమె 'దో అంజానే' సెట్స్‌కి ఉదయం 6 గంటలకు, అంటే సరైన సమయానికి చేరుకోవటం అందరినీ ఆశ్చర్యపరిచేది. ఆమెలో మార్పు అక్కడితో ఆగలేదు. తన పాత్ర గురించి లోతుగా ఆలోచించడం మొదలుపెట్టి, అమితాబ్‌లాగానే పాత్ర చిత్రణలో చక్కటి అంశాలను చర్చించసాగింది. దశాబ్దాల పాటు సినీ పరిశ్రమను ఉర్రూతలూగించే ప్రణయగాథకు అలా రంగం సిద్ధమైంది! 'దో అంజానే' కారణంగా అందరి దృష్టికి వచ్చిన విషయం ఒకటి లేకపోలేదు. రేఖ తొలిసారి ఒక చక్కటి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఒక్క చిత్రం రేఖకు కొత్త గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఔను, ఆమె తహతహలాడిన గౌరవం. దీనికి సంబంధించిన గొప్పతనమంతా అమితాబ్‌కే చెందుతుందన్నది రేఖ. ఒక వ్యక్తిలో ఆమె కోరుకున్న ప్రతి సుగుణానికి అతడు చిహ్నమైనాడు. రేఖ నెమ్మది నెమ్మదిగా అమితాబ్‌ను ప్రేమించసాగింది.

విడిపోవాలని నిర్ణయించుకుంది.

'చిన్నతనంలో నా మీద మా అమ్మ ప్రభావం ఉన్నట్లే, యౌవనంలో ఆ ప్రభావం నా జీవితంపై ప్రగాఢమైన ముద్ర వేసింది. సమయపాలన, మౌనం, క్రమశిక్షణ, అంకితభావం, ఏకాగ్రత వంటి వృత్తి నైపుణ్యాలు నేను అతడి నుండి నేర్చుకున్నాను. అతడు నా ప్రవర్తనను, జీవనశైలిని ప్రభావితం చేశాడు. నేను శాకాహారిగా మారి, ప్రమాదకరంగా జీవించడం మానేశాను. మార్పు మాత్రమే కాదు, ఆ మార్పు జరిగిన ప్రక్రియ కూడా ఎంతో అందమైనది' అని ఆమె భావనా సోమయాతో చెప్పింది. 'ముఖద్దర్ కా సికందర్' విడుదల తర్వాత అమితాబ్ రేఖతో కలసి పనిచేయడంపై అతడి భార్య జయ నిషేధం విధించినట్లు విశ్వసనీయ సమాచారం సినీపరిశ్రమలో వేగంగా వ్యాపించింది. ఈ విషయం గురించి రేఖ మాట్లాడుతూ, 'ఒక వారం తర్వాత (ముఖద్దర్ కా సికందర్ ట్రయల్ షో తర్వాత) సినీ పరిశ్రమలో ప్రతి ఒక్కరూ నాతో, 'అతు', నాతో పనిచేయనని తన నిర్మాతలకు స్పష్టం చేశాడని చెప్పటం మొదలెట్టారు. కానీ అతడు నాతో ఈ విషయమై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. నేను అతడిని దాని గురించి ప్రశ్నించడానికి ప్రయత్నించినప్పుడు, అతడు 'ఆ విషయం నన్ను అడగవద్దు, దాని గురించి నేను ఒక్క మాట కూడా మాట్లాడను' అని తేల్చి చెప్పాడు' అని చెప్పింది.

అదే ఇంటర్వ్యూలో, తాను ఎప్పుడూ ధరించే రెండు ఉంగరాలను అమితాబ్ తనకు బహుమతి చేశాడని ఆమె పేర్కొంది. తనతో కలసి పనిచేయడానికి అమితాబ్ నిరాకరించటంతో, ఆమె ఆ రెండు ఉంగరాలను తిరిగి ఇచ్చి అతడితో విడిపోవాలని నిర్ణయించుకుంది. ఆమె మాటల్లోనే, 'సహజంగానే నేనెంతో కలతపడ్డాను, మేము ఆ తర్వాత విడిపోయాము. ఆ సమయంలో నేను 'ఖూబ్‌సూరత్'లో పని చేస్తున్నాను. నా పాత్రలో త్రికరణశుద్ధిగా లీనమైనాను. సినిమా చివరిభాగంలో నేను నా రెండు ఉంగరాలు ధరించకపోవటం మీరు గమనించవచ్చు. అవి 'అతడిచ్చిన' ఉంగరాలు, నేను వాటిని నిద్రపోయేప్పుడు కూడా వేళ్ల నుండి తియ్యను. కానీ విడిపోయినప్పుడు నేను వాటిని అతడికి తిప్పి పంపాను'.

> **స్వయంసిద్ధ**
> **ఒక అభినేత్రి జీవనరేఖ**
> ప్రచురణ: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
> **ధర: రూ.350;**
> **ప్రతులకు:** శ్రీదేవి మురళీధర్ (99081 32166)



అమితాబ్ అవలంబించిన తీరు తనను తీవ్రంగా బాధించిందని రేఖ పేర్కొంది. ఆమెతో పని చేయకూడదన్న అతడి నిర్ణయానికి జయను బాధ్యురాలిగా నిందించింది. జయ వేదనకంటే తాను అనుభవించే బాధ ఎంతో ఎక్కువ అని రేఖ నాటకీయకంగా నొక్కి చెప్పింది. 'కొంతకాలం క్రితం ఓ అవార్డు ఫంక్షన్‌లో నేను కొన్ని కవిత్వ పంక్తులు గానం చేశాను. అందరూ ఆ పంక్తులు 'అతడి'కోసం ఉద్దేశించానని పొరబడ్డారు. నిజానికి ఆ మాటలు జయను ఉద్దేశించి అన్నాను', అని రేఖ చెప్పింది.

అక్కడ రోజంతా చదువుకోవచ్చు...

"పాఠాలు చెప్పడంతోనే టీచర్ బాధ్యత తీరిపోదు. పిల్లల్లో జ్ఞానాన్ని పెంచాలి. సొంత నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం కలిగించాలి" అంటారు మమతా సింగ్. ఆమె నెలకొల్పిన గ్రంథాలయం పిల్లలకే కాదు, పెద్దలకూ విజ్ఞానాన్ని పంచుతోంది. ఏ సీజన్‌లోనైనా రోజంతా తెరిచి ఉండే లైబ్రరీగానూ అది ప్రసిద్ధి చెందింది. అయితే దీని ఏర్పాటు కోసం మొదట్లో ఎన్నో అభ్యంతరాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నానంటున్న మమతాసింగ్ కథ ఆమె మాటల్లోనే...

"సావిత్రీబాయి ఫూలే పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేస్తానని చెప్పినప్పుడు మా గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. "మీ అమ్మ పేరు పెట్టుకో. లేదా మరేదైనా పేరు పెట్టుకో. ఆ పేరు మాత్రం వద్దు" అని కరాఖండిగా చెప్పారు. "సావిత్రీబాయి గొప్ప సంఘ సేవకురాలు. భారత దేశంలోని మొదటి బాలికల పాఠశాలకు తొలి మహిళా టీచర్. దాన్ని మీరు ఎందుకు వద్దంటున్నారు?" అని ప్రశ్నించాను. కానీ దానికి సమాధానం నాకు తెలుసు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కుల వ్యవస్థ చాలా బలంగా ఉంటుంది. ఎవరైనా కళాశాలలు, పాఠశాలలు పెట్టాలనుకుంటే... వాళ్ల అమ్మ పేరో, నాన్న పేరో పెట్టుకుంటారు. సావిత్రీబాయి దళితురాలు, మహిళ. కాబట్టే ఈ అభ్యంతరాలు. కానీ ఆమె బాలికా విద్య కోసం ఎంతగానో పాటుపడ్డారు. అందుకే ఎవరు ఏమన్నా నేను తలవంచలేదు. అలా 2018 జనవరిలో... 'సావిత్రీబాయి ఫూలే గ్రంథాలయం' ఉత్తరప్రదేశ్ అమేధీ జిల్లాలో నా స్వగ్రామమైన అగ్రేసర్‌లో ప్రారంభమయింది. దీని స్థాపన వెనుక ప్రధాన కారణం... ఉపాధ్యాయురాలిగా పాఠాలతో పాటు విజ్ఞానాన్ని, ఆలోచనాశక్తినీ అందించాలన్న కోరిక, పుస్తక పఠనం అంటే నాకున్న ఆసక్తి.

నా చిన్నప్పటి కల...



మా అమ్మ, నాన్న ఇద్దరూ టీచర్లే. చదువుకోవడానికి మంచి వాతావరణం ఉండేది. ఇంట్లో మ్యాగజైన్లు కొనేవాళ్ళు. బడి పాఠాలతో పాటు... కథల పుస్తకాలు ఎక్కువగా చదివే దాన్ని. నెలకు కనీసం ఎనిమిది, తొమ్మిది పుస్తకాలైనా పూర్తి చేసేదాన్ని. నాకు ఒక ప్రత్యేకమైన గది ఉండాలి. అది పై నుంచి కిందవరకూ పుస్తకాలతో నిండి ఉండాలి. ఇదీ నా చిన్నప్పటి కల. అయితే అది లైబ్రరీ కూడా కావచ్చని అప్పట్లో నేను ఊహించలేదు. మొదట్లో నన్ను బాగా చదువుకోవాలని చెప్పిన అమ్మానాన్నా... నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు... చదువు మాన్పించేశారు. పెళ్ళి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. అయితే నా అన్నలిద్దరూ ప్రోత్సహించడంతో... ప్రైవేటుగానే గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. పోటీ పరీక్షలు కూడా రాశాను. వివాహం అయిన వెంటనే... టీచర్ సెలక్షన్ ఎగ్జామ్ రాసి, సెలక్ట్ అయ్యాను. అలా 2002లో అధ్యాపకురాలుగా కెరీర్ మొదలైంది. నిజం చెప్పాలంటే ఇదేదీ నేను ప్రణాళిక వేసుకొని చేసింది కాదు. టీచర్ అవుతానని అస్సలు అనుకోలేదు. కానీ తొందరలోనే ఆ వృత్తి ఎంతగానో నచ్చింది. పిల్లలకు పాఠాలు చెబుతున్నప్పుడు ఒక విషయం గ్రహించాను. వాళ్ళు తరగతిలో చెప్పేవి కష్టపడి గ్రహిస్తున్నా... అంతకుమించిన పరిజ్ఞానమేదీ లేదు. అది పుస్తక పఠనం ద్వారానే వస్తుంది. కానీ మా ఊళ్ళో వాళ్ళకి పుస్తకాలు అందుబాటులో లేవు. ఈ అంతరాన్ని తగ్గించి, వారిని పుస్తకాలకు చేరువ చేయాలంటే... నేనే లైబ్రరీ ఏర్పాటు చేస్తే మంచిదనుకున్నాను. దాని ఫలితమే 'సావిత్రీబాయి ఫూలే లైబ్రరీ'. మా ఊరిలో అదే మొదటి గ్రంథాలయం. నా దగ్గర ఉన్న పుస్తకాలను అందులో




ఉంచాను. మరికొన్ని పుస్తకాలు కొన్నాను. కథలు, జనరల్ నాలెడ్జ్ లాంటి వాటికి ప్రాధాన్యం ఇచ్చాను. పుస్తకాలు చదవడం, తరగతులు ముగిశాక వాటి గురించి చర్చించడం లాంటివి ప్రోత్సహించాను. పిల్లలు కూడా ఎంతో ఉత్సాహం చూపించారు.

అంతా ఉచితం...

ఆశ్చర్యమేమిటంటే... క్రమంగా వయోధికులు, మహిళలు కూడా లైబ్రరీకి రావడం మొదలుపెట్టారు. ఖాళీ సమయాల్లో చిన్న చిన్న బాధ్యతలు కూడా తీసుకోవడానికి ముందుకొచ్చారు. గ్రామ పెద్దల వైఖరిలో కూడా మార్పు కనిపించింది. దాంతో నాకో ఆలోచన వచ్చింది... లైబ్రరీని రోజంతా తెరిచి ఉంచితే ఎలా ఉంటుందని. ఎవరు ఎప్పుడైనా రావచ్చు, తమకు కావలసిన పుస్తకాన్ని చదువుకోవచ్చు లేదా ఇంటికి తీసుకువెళ్ళి, చదివి తిరిగి ఇవ్వవచ్చు. ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. ఇప్పుడు... వర్షాకాలమైనా, శీతాకాలమైనా, వేసవి సెలవుల్లోనైనా... పండగలైనా, మరే సెలవులు వచ్చినా... మా లైబ్రరీ పని చేస్తూనే ఉంటుంది. డెబ్బైల వయసున్నవారి నుంచి ఏడేళ్ళ వయసువారి వరకూ ఇక్కడికి వస్తారు. వారికి నచ్చినవి చదువుకుంటారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. రోజూ పొద్దున్నే లైబ్రరీకి వచ్చి, వార్తాపత్రికలు చదివి... ఆ తరువాత తమ పనులకు వెళ్ళేవారు ఎంతో మంది ఉన్నారు. మంచి పుస్తకాలను ఎవరైనా సూచిస్తే... వాటిని తెప్పిస్తున్నాను. ఇక్కడ అంతా ఉచితం. ఎలాంటి మెంబర్‌షిప్ ఛార్జీలూ తీసుకోవడం లేదు. ఎక్కువగా నా సొంత డబ్బే ఖర్చు చేస్తున్నాను. ప్రస్తుతం బడి, లైబ్రరీ... ఇవే నా లోకమైపోయాయి. నేను ఏ రోజైనా పూజ చేయడం మానేశానేమో కానీ... లైబ్రరీకి వెళ్ళడం మానలేదు. తీర్థయాత్రల్లాంటి వాటికన్నా... ఎక్కడైనా మంచి పుస్తకాలు దొరుకుతాయంటే అక్కడికి వెళ్ళి తీసుకొస్తాను. దీని వెనుక నా స్నేహితుల సహకారం కూడా ఎంతో ఉంది. దూరప్రాంతాల్లో ఉన్నవాళ్ళు పుస్తకాలను పంపిస్తూ ఉంటారు. ఎక్కడినుంచైనా బరువైన పార్సిల్ వచ్చిందంటే... వాటిలో కచ్చితంగా పుస్తకాలే ఉంటాయని... పోస్ట్‌మ్యాన్లు నేరుగా మా లైబ్రరీకి తీసుకొచ్చేస్తారు. ఇప్పుడు పక్క గ్రామాల వాళ్ళు కూడా మా ఊరికి వచ్చి, పుస్తకాలు తీసుకువెళ్తున్నారు. తమ ఊళ్ళలో ఇటువంటి లైబ్రరీల ఏర్పాటుకోసం నన్ను సంప్రదిస్తున్నవారు కూడా ఉన్నారు. ఇలా రోజంతా నడిచే మా లైబ్రరీ నమూనాను అధ్యయనం చెయ్యడానికి అధికారుల బృందాన్ని రాష్ట్రప్రభుత్వం పంపింది. త్వరలోనే ఇతర ప్రాంతాల్లో అమలులోకి రావచ్చు. పిల్లలు కేవలం బడి పాఠాలకే పరిమితం కాకూడదు. ఈ పోటీ ప్రపంచంలో నెగ్గుకురావడానికీ, సరైన నిర్ణయాలు తీసుకోవడానికీ ప్రాపంచికమైన విజ్ఞానం వారికి ఎంతో అవసరం. దానికోసం పుస్తకపఠనం తప్పనిసరి. అందుకే వీలైనన్ని చోట్ల ఇలాంటి లైబ్రరీలను నెలకొల్పే ప్రయత్నంలో ఉన్నాను."

నవ్య | చిత్రజ్యోతి



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రూపొందుతున్న చిత్రం 'టిల్లూ స్క్వేర్'. అనుపమా పరమేశ్వరన్ కథానాయిక. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో నాగవంశీ నిర్మిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.

మాస్ మెచ్చేలా బెల్లంకొండ సినిమా




బెల్లంకొండ శ్రీనివాస్ కొత్త సినిమా తొలి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. సాగర్‌చంద్ర దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మాతలు. ఈ భారీ షెడ్యూల్‌లో కీలకసన్నివేశాలను పూర్తిచేశారు. అత్యుత్తమ సాంకేతికనిపుణులు పనిచేస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన వర్కింగ్‌స్టిల్స్‌ని ఆదివారం విడుదల చేశారు. ఈ నెల 3న బెల్లంకొండ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. బెల్లంకొండ పాత్ర అత్యంతశక్తిమంతంగా ఉంటుందని, మాస్ ప్రేక్షకులు మెచ్చే కథ, కథనాలతో రూపొందుతోన్న ఈ చిత్రం తప్పకుండా మంచి విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్ జ్ఞానేష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణం: 14రీల్స్ ప్లస్.



'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'

కోలీవుడ్ హీరో విజయ్ నటిస్తున్న 68వ చిత్రం టైటిల్‌ను నిర్మాణ సంస్థ ఏజీఎస్ ప్రొడక్షన్స్ ఆదివారం ప్రకటించింది. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌పై 'వెలుతురు చీకటిని మింగేయగలదు.. కానీ, చీకటి వెలుతురును మింగలేదు' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఈ చిత్రంలో విజయ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. మీనాక్షి చౌదరి, స్నేహ, లైలా, రాఘవ లారెన్స్, ప్రశాంత్, మైక్ మోహన్, ప్రేమ్‌జీ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్నారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందించిన ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు.

బ్రహ్మానందంకు స్వర్ణకంకణం ప్రదానం 3న



ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాగ సప్తస్వరం 35వ వార్షికోత్సవం సందర్భంగా ప్రఖ్యాత హాస్య నటుడు బ్రహ్మానందంకు జీవన సాఫల్య పురస్కారంతో పాటు స్వర్ణ కంకణం ప్రదానం చేయనున్నారు. ఈ నెల 3న రవీంద్రభారతిలో సాయంత్రం 6గంటలకు జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. దీంతో పాటు ప్రముఖ నాట్య గురువు సుజత వింజమూరికి ఆత్మీయ సత్కారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాగసప్తస్వరం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బుధవారం జరగనున్న వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ లక్ష్మణ్, నటుడు మురళీమోహన్ హాజరవుతారని తెలిపారు.

టీనేజ్ లవ్‌స్టోరీ



ఓ యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు శ్రీనాథ్ పులకురం తెరకెక్కించిన టీనేజ్ లవ్‌స్టోరీ 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు 500143'. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. గాయని మంగ్లీ ఆలపించిన 'దూడుం డుక్కుడుం' పాటను సంగీత దర్శకుడు జీవీప్రకాశ్ కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ గీతానికి సాయికిరణ్ సాహిత్యం అందించారు. కార్తిక్ రోడ్రిగ్జ్ స్వరాలు సమకూర్చారు. ప్రణవ్ సింగంపల్లి, రామ్ పటాస్ ముఖ్య తారాగణం. భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత.

జీవితం చెప్పిన కథ



దేవ్, ప్రియ చౌహాన్, సరిత ప్రధాన తారాగణంగా మురళీ రామస్వామి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దీనమ్మ జీవితం'. వై మురళీకృష్ణ, డి. దివ్యసంతోషి, బి సోనియా నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'డిఫరెంట్ కంటెంట్‌తో వస్తున్న చిత్రమిది. తమిళంలోనే కాదు తెలుగులోనూ కంటెంట్ ఆధారిత సినిమాలు తీయగలరని నిరూపిస్తుంది' అని చెప్పారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా అల్లుకున్న కథ ఇది, పెద్ద విజయాన్ని అందుకుంటామనే నమ్మకం ఉందని దేవ్ అన్నారు.